

# శ్రీ సాయి దర్శన్


సాయి ప్రబోధ ప్రచార మాసపత్రిక

సంపుటి-7 | సెప్టెంబర్-2008 | సంచిక 10

## SRI SAI DARSHAN

*(SaiPrabhodha Prachar Monthly)*

Editor : **Raojee**

Associated Editor : **A. Lakshmi**


**Subscription Rates**

| | |
|---|---|
| Maharaja Poshakulu | Rs.1,501-00 |
| Life Membership (20 Yrs) | Rs.751-00 |
| For 3 Years | Rs.275-00 |
| For 1 Year | Rs.100-00 |

M.O's / DD's may be drawn in favour of


**SRI SAI DARSHAN**
Dammaiguda, Nagaram Post,
Hyderabad - 500 083.
Phone : 040-65640220
Cell : 98667 48099
e-mail : srisaidarshan@rediffmail.com
Website : www.srisaidarshan.org.in



శ్లో॥ యజ్ఞదాన తప కర్మ
నత్యాజం కార్యమేవతత్
యజ్ఞోదానం తపశ్చైవ
పావనాని మనీషిణామ్

తా॥ ప్రతిఫలం ఏమీ కోరకుండా ఈశ్వరార్పణ బుద్ధితో చేయు యజ్ఞములు - తపస్సు, దానములు - ధర్మములు - మానవుని చిత్తము నిర్మలము చేసి తద్వారా అనన్యభక్తి జ్ఞానములు కలిగి మోక్షము లభించుచున్నది. గాన మనము కోరికలు లేని బంధములు లేని సత్కర్మలు చేసితీరవలెను.

# విషయసూచిక


సంపాదకీయం............................................................3
శ్రీసాయిసద్గురు సమర్థ– సగుణోపాసన.....................................4
పాలరాతి విగ్రహం కాదు, మూర్తీభవించిన దైవత్వం.........................5
సాయిఆరతులలో దాసగణు............................................11
ఆనాటి బాబా భక్తుల అనుభవాలు....................................15
శ్రీశిరిడి సాయి సత్యవ్రతము...........................................21
శ్రీకృష్ణసాయి పరమాత్మ..................................................24
పురుషోత్తమ ప్రాప్తి యోగము..........................................28
బాలాసాహెబ్ మిరికర్...................................................33
వందనం శ్రీసాయినాథా!.................................................35
జీవిత సత్యం..............................................................37
శ్రీసాయినాథ భజనమాల...............................................38
బాబా నిత్యసత్యుడు నాటి లీలలు నేటి లీలలు............................44
పిలిచిన పిలుపే విశ్వవిఖ్యాతి గాంచిన వేళ..............................47
సాయినాథ ఉవాచ.........................................................49
ఆధ్యాత్మిక దర్శన్........................................................53
అమృతవాక్కులు..........................................................54
శ్రీసాయిబాబా జన్మరహస్యం.............................................55
గురుపౌర్ణమి...............................................................57
శ్రీలలితా సహస్రనామములు.............................................58
బ్రహ్మసాక్షాత్కారమునకు శ్రీగురు అనుగ్రహము..........................60
ఆధ్యాత్మిక చింతనతోనే ఆనందం........................................66
ప్రారబ్ధకర్మ...............................................................70
నేటి మానవ జీవితం.....................................................72
మానసిక ఏకాగ్రత.........................................................76
వార్తలు....................................................................78
లేఖలు.....................................................................79



శ్రీసాయినాథాయనమః

'సత్సంగం' అనేది భగవానుని దయవలననే ప్రాప్తిస్తుంది. సత్సంగం వలన కలిగే లాభం కూడా ఆ భగవత్కృపవలననే కలుగుతుంది.

మనవలన యజ్ఞం, దానం, తపస్సు, తీర్థగమనం, వ్రతం, సేవ, ఉపకారం, భగవద్ధ్యానం, సత్సంగం, స్వాధ్యాయం మొదలైన పనులు ఏవి జరిగినా దానికి మూలం భగవత్కృపయే అనుకోవాలి.

కష్టాలలో అందరూ భగవానుని స్మరిస్తారు. సుఖాలలో ఎవడూ స్మరించడు. ఒక కష్టదశలో మాత్రమే కాక, సుఖావస్థలో కూడా ఎవడు భగవానుని స్మరిస్తూ ఉంటాడో వానికి ఇక దుఃఖం అన్నది కలుగనే కలుగదు.

కష్టాలు ఏవి యెప్పుడు కలిగినా మనం ఇంతకు ముందు ఏవో పాపాలు చేసాం, దాని ఫలం యీ రూపంగా మన ముందుకు వచ్చింది, అనుభవిస్తున్నాం అనే భావన మనలో పనిచేస్తూ ఉండాలి.

భక్తుడు శేషజీవితం అంతా నవ్వుతూ, ఆనందముతో చిందులు త్రొక్కుతూ, హాయిగా పాటలు పాడుకుంటూ, ముగ్ధుడు అవుతూండాలి.

# శ్రీసాయిసద్గురు సమర్థ-సగుణోపాసన

మూలం :- శ్రీకృష్ణారావ్ జోగేశ్వర్ భీష్మ అనుసరణ : నైనారు అప్పాస్వామి

రెండవ భాగం- మధ్యాహ్న ఆరతి 12 గం॥లకు (గత సంచిక తరువాత భాగం)

(-)

## 3. షిరిడీ నా పండరిపురం

(1) షిరిడీ నా పండరిపురం
శ్రీసాయి అచట అధిదైవం
బాబా అచట క్షేత్రపాలకుడు.......

(2) విశుద్ధ భక్తిప్రవంతియే
అచట చంద్రభాగానది
పుండలీకునికై మన భావాలు
మేల్కొల్పబడినవి
మన భావాలు పుండలీకునకై
జాగృతమైనవి...

(3) రండు రండు జనులందరు
చేయండి బాబాకు వందనం
నమస్కరించండి బాబాకు
శ్రీసాయిబాబాకు నమస్కరించండి


(4) గాణు అర్థిస్తాడు
వేగంగా వచ్చి మమ్మాశీర్వదించండి బాబా !
నా జననీ మమ్మాశీర్వదించు
పరుగున వచ్చి మమ్మనుగ్రహించు సాయీ !



# పాలరాతి విగ్రహం కాదు, మూర్తీభవించిన దైవత్వం


యం.పి.సాయినాథ్, హైద్రాబాద్

ద్వారకామాయివాసి సాయి ఫకీర్ కనుమరుగయ్యారు. తిరిగి 1954 అక్టోబర్ 7వ తేదీన పాలరాతి విగ్రహరూపంగా తన భక్తులను కటాక్షిస్తున్నారు. అసలు సాయిబాబా సమాధి చెందటం ఒక జిత్తులమారితనం అంటారు సాయిని ప్రత్యక్షంగా సేవించి తరించిన హేమాడ్‌పంత్. ఆ మాట నిజమే! ఎందుకంటే శారీరకంగా ఉన్నప్పుడయినా, పాలరాతి విగ్రహరూపంలోనైనా సాయిబాబా భక్తులకు ప్రసాదించే అనుభవాలు ఒకే రకం.



**"ఎంత వారికైనను సాయి దర్శనమే కనువిప్పు"**


అని వ్రాస్తారు శ్రీకోటంరాజు శ్రీనివాసరావు. ఉదాహరణలు కోకొల్లలు. ఆచార్య శ్రీఎక్కిరాల భరద్వాజగారే ఒక నిదర్శనం. 1963 ఫిబ్రవరి 8న సమాధిని దర్శించిన ఆయనకు, 1918వ సం॥లో సమాధి చేయబడిన ఆ దేహం ఆ సరికెంత కుళ్ళివుంటుందో గదా ! బహుశా ! ఆ దుర్వాసన బయటకు రాకుండా ఉండేందుకు కాబోలు పైనంతా పాలరాళ్ళతో బిగించి దట్టంగా ధూపం వేస్తున్నారు' అనిపించింది.



మరునాడు ఆయన దృష్టి జీవకళతో కళకళలాడుతున్న సాయివిగ్రహం మీద పడింది. అప్పుడు ఆయనకు కలిగిన అనుభవం ఆయన మాటలలోనే ఇలా వున్నది.

"ఆ విగ్రహం లోని బాబా ముఖం చూస్తుంటే అందులోని సాయి చూపు అంతర్ముఖమై, ఏదో అతీతమైన స్థితిలో వున్నట్లుగాక విశ్వమంతా మహత్తర చైతన్యంలో సంకల్ప మాత్రంగా వున్నదో, దానితో ఆయన తాదాత్మ్యం చెంది వున్నారనిపించింది. అది కేవలం ఒక భావంగా గాక ఒక అనిర్వచనీయమైన అనుభవంగా నా హృదయాన్ని కబళించింది. నా చుట్టూ, నా లోపల ఏమి జరుగుతున్నదో తెలియలేదు..." ఇక ఏముంది. సకల స్థిర స్వరూపమైన శ్రీ సాయికటాక్షం ఆయనకు లభించింది. వేలాదిమందికి ఆయన ద్వారా సాయి తత్త్వం అవగతమయింది.


పన్వేల్ శ్రీసాయి సంస్థాన పీఠాధిపతి సాయి నారాయణ మహారాజు ఇలా కీర్తించారు...



"మలిచెను పాలరాతిలో జాగృత
మూర్తిని శ్రీతాళీంజీ జాగృతులై దర్శనమీయును
అభయప్రదాత శ్రీసాయినాథ్ జై !"

శ్రీసాయినాథుని దివ్యసన్నిధిలో ఎంతసేపు నిలిచినా తనివి తీరదు! ఎంతసూపు చూస్తున్నా విసుగనిపించదు. ఎన్నిసార్లు చూసినా ఇంకా ఇంకా మళ్ళీ, మళ్ళీ చూద్దామనిపిస్తుంది. ఇంకాసేపు, ఇంకొంచెంసేపు అంటూ ప్రతిభక్తుని






మనస్సూ, శిరస్సూ, కాళ్ళూ, కళ్ళూ, నిక్కి నిక్కి చూస్తూ శ్రీ సాయినాథుని దివ్యసమ్మోహనమూర్తి యొక్క దర్శనానికి తహతహలాడుతూనే వుంటారు భక్తులు.

సాయిబాబా పాలరాతి విగ్రహ రూపంలో భక్తులకు మహదానందాన్ని అందించడం కూడా కొన్ని ఆశ్చర్యకర సంఘటనలతో ముడిపడివున్నది. సాయిబాబా తన జీవితకాలంలో ఎన్నో, ఎన్నెన్నో చమత్కారాలు చూపించారు. సమాధి అనంతరం సాయి చూపిన అత్యంత ఆహ్లాదకరమైన చమత్కారం పాలరాతిలో తనను తానే చిరంజీవిగా మలుచుకోవడమే !

సాయిబాబా విగ్రహానికి ఎవ్వరూ, ఎక్కడ నుండీ పాలరాతిని కొనుగోలుచేయలేదు.


ఇటలీ గనుల నుండి బొంబాయి నౌకాశ్రయానికి ఎలా చేరిందో తెలియదు ఆ పాలరాయి. మరి బొంబాయిలోకి ఎలా చేరిందో తెలియదు. ఎవ్వరూ ఆ పాలరాతిని తమదంటూ అధికారుల వద్దకు పోలేదు. ఆ అధికారులే ఆ పాలరాతి హక్కుదారుడు రాకపోయేసరికి, వేలం వేశారు. ఆ వేలంలో ఎవరో ఆ పాలరాతిని శిరిడిసాయిబాబా సంస్థానానికి ఇచ్చారు. ఎందుకు ఇవ్వబడ్డదో కూడా తెలియదు. సాయి సంస్థానంవారు ఆ పాలరాతి నాణ్యతను గుర్తించి సాయిబాబా విగ్రహాన్ని చెక్కించుదామని నిర్ణయించారు. చేయి తిరిగిన మహాశిల్పులకు కూడా సాయిబాబా విగ్రహాన్ని చెక్కడం కష్టమే. అందుకు కారణం వివిధ కోణాల నుండి తీయబడిన సాయిచిత్రాలు లేకపోవడమే !



సాయిబాబా తనకు కావలసిన వారినే ఎన్నుకున్నారు. ఆ శిల్పరచనా భారం హైదరాబాద్‌కు చెందిన బాలాజీ వసంత తాళీంలపై పడ్డది. అనన్య సాయి భక్తుడైన తాలీం సాయిని ఆర్తితో ప్రార్థించాడు. సాయి అతనికి స్వప్నదర్శనం ఇచ్చారు. తనను వివిధ కోణాల నుండి వీక్షించమన్నారు సాయి ఆ స్వప్నంలోనే. సాయి విగ్రహాన్ని చెక్కడానికి నమూనా ఫోటోలు సరిగా లేవు. ఆ సమయంలో సాయిబాబా, బాలాజీ వసంత తాళీంకు స్వప్నంలో సాక్షాత్కారమిచ్చి తన విగ్రహానికి తానే మోడల్‌గా నిలిచాడు.

**కల నిజమాయేగ !**

స్వప్నంలో చూచిన సాయిబాబాను, పాలరాతిలో మలచాడు బాలాజీ. ఆయన మలచాడు అనటం కంటే సాయియే ఆ పని చేయించుకున్నారనడం సబబు !



బాలాజీ మలచిన ఆ సాయిబాబా విగ్రహాన్ని, సాయిభక్తుడు శ్రీసాయి శరణానంద 07-10-1954 ప్రతిష్ఠించారు. సాయి శరణానంద ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు అనడం కంటే, సాయిబాబాయే ఆ విగ్రహరూపంలో దైవత్వాన్ని నింపారు అనటం సమంజసమేమో !

ప్రపంచ ప్రఖ్యాత శిల్పకారులు, సత్పురుషులు,



కులమత వర్ణం లేకుండా ఆ సాయిబాబా విగ్రహాన్ని తిలకించారు, పూజించారు, తమ మనస్సులలో నింపుకున్నారు.

ఆ సాయిబాబా విగ్రహం సజీవమే. సాయిని సజీవిగానే భావించి పూజాదికాలు చేస్తున్నారు.

"మలచెను పాలరాతిలో జాగృత మూర్తిని
శ్రీతాళీంజీ
జాగృతులై దర్శనమీయును
అభయప్రదాతగ శ్రీసాయినాథ్‌జీ"

అని శ్రీ భగవతీ సాయి సంస్థానానికి చెందిన సాయినారాయణ్ మహారాజు వ్రాసారు. పాలరాతి సాయిబాబా సహజత్వాన్ని డా॥వి.వి.బాలకృష్ణగారు ఇలా వర్ణించారు. 'సమాధి మందిరంలో సాయి దివ్య రూపం నయానందం చేస్తుంది ! ఆత్మశాంతినిస్తుంది ! ఎంత చూసినా తనివి తీరని సుందర రూపమది ! భవతరణానికి సాయిపడే భగవత్ స్వరూపమిది! భక్తుల మదిలో నిల్చిపోయే భవ్యరూపమిది ! చూడ వేయి కనులైనా చాలని వేదాంతవేద్యుని రూపమిది ! ఒకసారి చూసినంతనే మనసుకు హత్తుకునే రూపమిది !'

మనము ఎవ్వరం చూడని సాయిబాబాను మన కండ్ల ఎదుట ప్రత్యక్షంగా దర్శింపచేసిన బాలాజీ వసంతతాళీం శిల్పికాదు – అమరశిల్పి! ఆ విగ్రహంలో ఉన్నది పాలరాయి కాదు. దైవత్వమే !

విగ్రహనిర్మాణానికి సూత్రధారి సాయిబాబాయే ! అయినా శిల్పపాత్రధారి వసంత తాళీంయే.

సాయి విగ్రహాన్ని ప్రతిష్టించి ఏభై మూడేళ్ళు నిండిన తరుణంలో తాళీం చెక్కిన సాయి శిల్పాన్ని మన హృదయాల్లో నిల్పుకుందాం ! తాళీంకు కృతజ్ఞతలు తెల్పుకుందాం !

# సాయినాథా ! శిరిడీ నాథా !

-పి. ఆంజనేయులు గుప్తా, 1842, 34వ క్రాస్,బియస్‌కె 2వ స్టేజీ,
బెంగళూరు- 560 070



శ్రీసాయిబాబా నా సాయిబాబా
రావాలి మాదరికి సాయినాథా శిరిడినాథా ॥
తలిచెదమయ్యా నీ మహిమలే
పలికెదమయ్యా నీ నామమే
చేసెదమయ్యా నీ పూజలే
కాపాడవయ్యా నీ చరణదాసులము సాయిబాబా శిరిడినాథా ॥
వెలసినావు శిరిడిమట్టిలో
నిలిపావు నీ రూపము అందరిలో
పలికించావు నీ నామము సదా
ఎంత ఘనుడవయ్యా శిరిడినాథా సాయిబాబా ॥
తలచినవానికిచ్చావు నీ ప్రేమ
తలచివానికిచ్చావు ఆనందాన్ని
ప్రేమతో పంచావు విభూదిని
ఊధియే సర్వనివారిణి అన్నావు
ఎంత దయుడవయ్యా సాయిబాబా శిరిడినాథా ॥
ప్రేమ స్వరూపా దయామయా సాయిబాబా శిరిడినాథా ॥





# సాయిఆరతులలో దాసగణు

తిరుమలశెట్టి వేంకట సుబ్బారావు, షిరిడీ సాయిబాబా మందిరం, కొవ్వాడ.



సరిగా యాభై సంవత్సరాల క్రితం (1957వ సంవత్సరం డిసెంబరు నెలలో) విదేశీయుడైన ఆర్థర్ ఆస్సబర్న్ సాయిబాబాను గురించి వ్రాసిస్తూ, "భారతదేశంలో, ఈయనకున్న వారి కంటె ఎక్కువ మంది భక్తులున్న సాధువు, లేదా అంత విస్తృతమైన ఆరాధన వ్యవస్థ గల సాధువు బహుశా మరొకరు లేరు (అలాగని రాముడికి, కృష్ణుడికి లేరని కాదు. ఖచ్చితంగా చెప్పాలంటే, వారు సాధువులు కారు, అవతార పురుషులు)."

సాయిబాబా ఆరాధనా వ్యవస్థలో ఆ(హా)రతులు ప్రధానభాగంగా ఉంటాయి. నాలుగు పూటలా నాలుగు ఆరతులు ఇవ్వబడిన సాయిమందిరమే అసలైన సాయిమందిరమని భక్తులంటారు. ఈనాడు నడుస్తున్న ఆరతులు అంతిమ రూపు దిద్దుకోవడానికి 20, 30 ఏండ్లు పట్టాయి. అవి వివిధ భాషలలో రచింపబడ్డాయి. వేర్వేరు భక్తుల రచనలు ఆయా ఆరతులలో సాక్షాత్కరిస్తాయి. సాయి మహారాజును ప్రధాన పాత్రగా తీసుకుని, ఆయనను గూర్చి వ్రాయబడిన ఆరతులు ప్రత్యేకించి 16 మాత్రమే ఉన్నాయి. వాటిని

శ్రీకృష్ణజోగేశ్వర భీష్మ, గణపతిరావ్ దత్తాత్రేయ సహస్రబుద్ధే, కాశీనాథ గోవింద ఉపాసనీ శాస్త్రి, పండిత్ మోహినీరాజ్, మాధవఅడ్కర్, బాలకృష్ణ విశ్వనాథ్‌దేవ్‌లు రచించారు. భీష్మ 9, దాసగణు (గణపతిరావ్) 3 ఆరతులను రచించగా, మిగిలిన నల్గురు ఒక్కొక్క ఆరతిని రచించారు. వీరందరిలోనూ దాసగణులో కొంత ప్రత్యేకత కనిపిస్తుంది.

ఆ నల్గురిలోను ప్రప్రథమంగా సాయివద్దకు చేరినది దాసగణు. ఎక్కువ కాలం జీవించి సాయిని మహారాష్ట్రమంతా వ్యాపింపచేసింది, జీవితకాలమంతా కేవలం సాయిబాబా మహత్తును ప్రచారం చేసింది దాసగణుయే అని తెలుస్తుంది.

ఆ నల్గురిలోను రెండు భాషలలో హిందీ (హిందుస్తానీ) మరాఠీలో రచించింది దాసగణు మాత్రమే. ఉపాసనీ బాబా సంస్కృతంలోను మిగిలిన నలుగురు మరాఠీలోను ఆరతులను రచించారు.

దాసగణు రచనలో (ఆరతులలో) దాస్యభక్తి, సఖ్యభక్తి ప్రధానంగా చోటు చేసుకున్నాయి. మశీదు ఊడ్చే చీపురుగా దాసగణు తనను గూర్చి చెప్పుకున్నాడు.

దాసగణు ఆరతులలో సాయి పండరీనాథుని అవతారమే. ఇతర ఆరతి గీతాల రచయితలవలె దాసగణు సాయిలోని 'గురుత్వాని'కంటే, సాయిలోని 'మాతృత్వాని'కే దాసోహం అంటాడు. 'గురుత్వం'లో కూడా 'మాతృత్వం' ఉంటుంది. కాని గురుత్వం నుండి ఉద్భవించే మాతృకరుణ కంటే, కరుణానిలయమయిన మాతృదేవి ఆరాధన దాసగణును ఆకట్టుకున్నది.

సాయిబాబాయే స్వయంగా అడిగి పాడించుకునేవారు దాసగణు గీతాలను లక్ష్మణభట్‌జోషి, మాధవ ఫస్లే సాయిబాబాతో పాటు చావడిలో పడుకునేవారు. లక్ష్మణభట్ ఇలా తెలిపాడు "చావడిలో మేమున్నప్పుడు



సాయిభజన పాటలు పాడమనేవారు. గణు పాటలుగాని, తుకారం పాటలుగాని పాడమనేవారు. నేను దాసగణు వ్రాసిన రహం నజర్ కరో... మొదలైన పాటలు పాడేవాడిని. సాయి వాటిలోని రాగాన్ని, భావాన్ని మెచ్చుకునేవారు...."

దాసగణు ఆరతులు ఆ భక్తుని జీవితంలో జరిగిన యధార్థ ఘట్టాలను జ్ఞప్తికి తెస్తాయి. ఉదాహరణకి "షిరిడీ మాఝే పండరిపుర..." అనే పాట దాసగణు పండరీనాథుని దర్శనం కోరి ప్రార్థించడం, సాయి సమాధానం మొదలైన వాటిని గుర్తుకు తెస్తాయి. దాసగణుకు సాయితోగల అనుబంధాన్ని ఆయా గీతాలు తెలియజేస్తాయి.


దాసగణు ఆరతుల విశేష ప్రజాదరణను పొందాయి. దాదాపు ప్రతిసాయి భక్తునికి దాసగణు ఆరతులలోని కొన్ని కొన్ని మాటలు తెలిసి వుంటాయి. సాయిభక్తులు దాసగణు ఆరతుల పట్ల చూపే అభిమానాన్ని చూచి నందాదీప్ పిక్చర్సువారు తీసిన "షిరిడీకే సాయిబాబా" అనే సినిమాలో సాయి రహం నజర్ కరనా...., రహంనజర్‌కరో... అనే గీతాలు చోటుచేసుకున్నాయి. ఆ గీతాలు అందరకూ సులువుగా నోరుతిరిగేటట్లుండే హిందూస్తానీలో దాసగణు రచించటం కూడా ఒక కారణమే.

ఇతర ఆరతి పాటలకు దాసగణు పాటలకు ఒక తేడా వున్నది. ఇతర ఆరతి పాటలు ఆయా ఆరతి పాటలు పాడే సమయాలలోనే పాడుతారు. దాసగణు రచించిన "శిరిడి మాఝే పండరీపుర"ను ఆరతి సమయాలలోనే కాక మరికొన్ని ప్రత్యేక సమయాలలో కూడా పాడతారు. (ఉదా: చావడి ఉత్సవం).

అలా దాసగణు ఆరతులు తమవైన కొన్ని ప్రత్యేక విలువలను

కలిగివున్నాయి. అవి భక్తి, సాహిత్య, అనుభవాల త్రివేణి సంగమము. వాటి శ్రవణము, పఠనము పవిత్రులను చేస్తాయి.

నాలుగు వేళలా సాయికి క్రమం తప్పకుండా ఆరతులు ఇస్తూ, అందరం తరిద్దాం.



సాయి శరణం – బాబా శరణం

బాబా శరణం – సాయి శరణం

## సాయినామం

**చల్లా సరోజినిదేవి,** గ్రేడ్-1 హిందీపండిట్, ప్రభుత్వబాలికోన్నత పాఠశాల, ఖమ్మంజిల్లా

*సాయి సాయి సాయి సాయని*
*పిలువరె మనసారా జనులారా !* ॥ సాయి ॥
*పిలిచినంతనె పలుకును కరుణాళుడు*
*సాయీ గాంచరె కనులారా* ॥ సాయి ॥
*పంచదారల కన్న పాలు తేనెల కన్న*
*పరమాన్నము కన్న మధురమ*
*సాయి సాయి అన్న దివ్యనామం* ॥ సాయి ॥
*భవసాగర మీదగ నావ తానగును*
*సాయి దివ్యనామం శ్రీసాయి మధురనామం* ॥ సాయి ॥
*ఈసునసూయలను విషనాగుల బారినుండి*
*మనలను కాపాడు తారకమంత్రం* ॥ సాయి ॥
*లోకాల శోకాలను బాపును*
*శాంతి ప్రేమలనే దీపాలను చూపును* ॥ సాయి ॥
*మదిలోని అజ్ఞాన తిమిరాలను*
*తరిమేది శ్రీ సాయి దివ్యనామం* ॥ సాయి ॥



# ఆనాటి బాబా భక్తుల అనుభవాలు

'అమృతధార' ఆనాటి శ్రీ షిరిడీసాయిబాబా భక్తుల అనుభవాలు ఆంగ్లమూలం శ్రీ బి.వి.నరసింహస్వామీజీ, తెలుగు అనువాదం శ్రీతోట భాస్కరరావు, ప్రచురణ : శ్రీ షిరిడి సాయిబాబా మందిరము, కొవ్వాడ

## శ్రీమతి చంద్రాభాయి – విలీపార్లే, బొంబాయి :

## వీరి అనుభవములు

నేను సాయిబాబాను గత 44 సం॥గా పూజించుచున్నాను. సాయిబాబా సమాధి చెందుటకు 20 సం॥ల ముందు నేను షిరిడీ వెళ్ళితిని. నా పూజాగదిలో నున్న సాయి చిత్రపటము చూడండి. నేను షిరిడీలో ఉన్నప్పుడు ప్రతిరోజు సాయి తన స్వహస్తములతో నాకు ఇచ్చిన విభూతిని నేను జాగ్రత్త పరుస్తూయున్నాను.

సాయిబాబా నాకు పన్ను ఒకటి ఈయగా దానిని నేను తాయెత్తులోవేసి కట్టించాను.

నాకు సాయిబాబాపై అపారమైన భక్తి యుండెడిది. ఈ నా భక్తికి సాయిబాబా కూడా స్పందించేవారు. నేను 1898 షిరిడీ వెళ్ళినప్పుడు ప్రస్తుత మశీదు లేకుండెను. సాఠేవాడా కూడా లేకుండెను. అవి అన్నీ తరువాత నిర్మించబడినది. అప్పటిలో సాయి ఒక వేపచెట్టు క్రింద కూర్చొని యుండెడివారు. సాయి దీపములను నీటితో వెలిగించుట చూచితిని. సాయి మశీదులో ఒక



బల్లచెక్కపై ఎత్తున నిదురించుట చూచితిని. అప్పటిలో పెద్ద పెద్ద వాళ్ళెవరూ షిరిడీకి వచ్చెడివారు కారు. షిరిడీకి వెళ్ళినప్పుడల్లా గ్రామస్థుల ఇండ్లలో యుండెడిదానను.

నా భర్త బోర్కర్ శ్రీసాయిని దర్శించుటకు ఎన్నడూ వెళ్ళలేదు. అయినను వారిపై కూడా సాయి తన ప్రేమను చూపేవారు.

1909లో ఇంజనీరు అయిన నా భర్త, పండరీపురంలో ఒక వంతెన నిర్మాణపు పనులలో ఇచ్చట యుండెను. నా భర్త పండరీపురంలో నుండగా నేను సాయి సేవనిమిత్తమై షిరిడీకి వెళ్ళితిని. ఒక రోజు సాయి నన్ను పండరీపూర్‌కు వెళ్లమని, తాను కూడా వచ్చెదనని అనిరి. కావున నేను పండరీపూర్‌కు పయనమైతిని. అచ్చట ఏమి జరిగినదో నాకు తెలియదు. నా భర్త తన ఉద్యోగానికి రాజీనామా యిచ్చి బొంబాయిలో యున్నారని నాకు తెలిసినది. నాకు చాలా విచారమైనది. నావద్ద డబ్బు లేకుండెను. నా వద్ద యున్న డబ్బు "కురుద్వాడీ" స్టేషన్‌వరకు సరిపోవును. ఇప్పుడు ఏమి చేయవలెనో ఏమీ తోచలేదు.

ఆకస్మాత్తుగా ఒక ఫకీరు నాయందు ప్రత్యక్షమయ్యెను. "ఏమిటి ఆలోచించుచున్నావు?" అని నన్నడిగెను. నా సమస్య అతనికి చెప్పలేదు. నా భర్త 'దోన్డ్'లో యున్నారని కాబట్టి నన్ను వెంటనే దోన్డ్‌కు వెళ్ళమని చెప్పెను.



నావద్ద రైలు టికెట్టుకుగాను డబ్బులేద"ని చెప్పితిని. ఆ ఫకీరు తక్షణమే టిక్కెట్టు ఇచ్చి వెళ్ళిపోయెను. నేను నాతోయున్న మరిద్దరు దోన్డ్‌కు పయనమైతిమి. మరి దోన్డ్ స్టేషనులో నా భర్త టీ త్రాగి కునుకు పడుచుండెను. ఆయనకు ఒక ఫకీరు ప్రత్యక్షమై ఆయనతోయిట్లనెను. "నీవు నీ భార్య విషయములో ఎందకు అశ్రద్ధ చేయుచున్నావు? ఆమె కొద్దిసేపట్లో రైలులో దోన్డ్‌కు రానున్నది. ఆమె పయనిస్తున్న రైలు పెట్టె నెంబరు ఫలానా" అని చెప్పెను. నా భర్త ఆశ్చర్యపడి ఎవరాతను ఇంతసేపు నాతో మాట్లాడుచున్నాడు అని నలు దిశలు చూచెను. కాని ఫకీరు జాడ తెలియలేదు. నేను దోన్డ్ స్టేషనులో రైలు దిగగా, నన్ను ఆహ్వానించుటకు నా భర్త నేను దిగుచున్న రైలు పెట్టెవద్దకు వచ్చి, తాను యుంటున్న క్వార్టరుకు తీసుకొనివెళ్ళెను. దోన్డ్ స్టేషనులో ఫకీరు ఒకరు తనవద్దకు రావడం విషయమై నాతో చెప్పి నావద్ద నున్న సాయిబాబా ఫోటో ఒకసారి చూపమనెను. సాయి ఫోటో చూడగానే నా భర్త తనవద్దకు వచ్చిన ఫకీరు మరియు సాయిబాబా ఇద్దరు ఒకటేనని గుర్తించేరు.

ఒక గురుపౌర్ణమి రోజున, నాగురు బంధమైన ఉపాసనీ మహరాజ్ షిరిడీ వదిలి "ఖరగ్‌పూర్"కు పయనమగుచుండెను. పూజాద్రవ్యములు, నైవేద్యము తీసుకొని ఉపాసనీ మహారాజ్‌ని పూజింపమని సాయి నాతో చెప్పిరి. నేను ఈ విషయము ఉపాసనీ మహరాజ్‌కు తెలియపరచి, వారిని పూజింతిని. దీనిని ఉపసానీ మహరాజ్ యేమీ అభ్యంతరం తెలుపలేదు. వారితో నాకు గురుశిష్యుల బంధము మాత్రమే. షిరిడీలో కొందరు ప్రజలు ఉపాసనీ మహారాజ్‌ని ద్వేషించేవారు. కాని నేను మాత్రము వారిని ద్వేషింపలేదు. ఇతరుల నెవ్వరిని మనము ద్వేషింపరాదని, ఎవ్వరైనను మనను ద్వేషించిన అటువంటి

వారిని త్యజించి, నామ జపము చేసుకొనవలెనని సాయిబాబా చెప్పేవారు. కాని ఉపసాని మహారాజ్ ననెందులకో వారికి చేరువుగా వుండనిచ్చేవారు కారు. నేను వారితో మనస్సు విప్పి మాట్లాడుదామంటే నాకు ఆ అవకాశము వారు నాకు ఇయ్యలేదు.

సాయిబాబా నన్ను దయతో 1918కి ముందు మరియు తరువాత కూడా చూసేవారు. 1918 దశరాకి 3 నెలల ముందు సాయిబాబా నాతో యిలా అనిరి.“బాయి ! ఇకపై నన్ను దర్శించుటకు నీవు షిరిడీకి రానవసరము లేదు. నేనెప్పుడు నీతోనే యుంటాను.”

సాయిబాబా ఆరోగ్యము ఏమీ బావుండలేదని, వారు ఎక్కువరోజులు జీవించరని నాకు హెచ్.ఎస్.దీక్షిత్‌వారి ద్వారా తెలియవచ్చినది. నేను వెనువెంటనే షిరిడీకి బయలుదేరితిని. సాయిబాబా కొన్ని క్షణాలలో సమాధి చెందుతారనగా నేను చేరితిని. వారి ఆఖరి క్షణములో నేను సాయికి మంచినీళ్ళు యిచ్చితిని సాయి తన ప్రాణములు విడిచిరి.

సాయిబాబా సమాధి చెందిన అనంతరం నేను 1919లో ఒకసారి 1933లో ఒకసారి షిరిడీకి వెళ్ళితిని. సాయి నాకు హామీయిచ్చినట్లు వారు ఎల్లవేళలా నన్ను రక్షించుచున్నారు. నేను సాయిబాబాపై కొన్ని కవితలు రచించితిని. వాటిని, నా అనుభవములను “సాయిలీలా మాసిక్” అను సాయిసంస్థవారి పత్రికలో ప్రచురింపబడినది.

1921 సం॥లో నా భర్త బండి క్రిందపడి కాలు విరిగెను. అప్పుడు నేను కాలు విరిగిన చోట ఔషధపు ఆకులు వేసి కట్టుకట్టి విభూతి కూడా వ్రాసితిని. 3 నెలలలో ఆయన కాలు సరిగా అయినది. 1921లో నాకు ఒక



బిడ్డ కలిగెను. అది కూడా బాబాగారి కరుణయే. నాకు 48వ యేట బిడ్డ జన్మించెను. ఆ వయస్సులో బిడ్డలు కలగరని నిపుణులు చెప్పిరి. కాని సాయిబాబా ఆశీర్వాదములతో నేను బిడ్డను కంటిని. ధనత్రయోదశిరోజు సాయిబాబా సమాధి చెందిన 3 సం॥ల 2 రోజులకు నేను మగబిడ్డను కంటిని. నాకు సుఖప్రసవమైనది. దగ్గర డాక్టర్లుగాని, నర్సుగాని లేరు. ఏ విధమైన మందులూ లేవు. ప్రసవమునకు ముందు నాకు కాళ్ళు వాచుట యుండెడిది. నేను ఆహారము మితముగా తీసుకొని, నీళ్ళు, విభూతి ఎక్కువగా తీసుకొంటిని.

నా భర్త మరణించుటకు 2 నెలల ముందు నన్ను యా క్షణమునకై బాబా నన్ను ధైర్యవంతురాలిగా చేయుచుండెను. నాకు స్వప్నములో కనిపించి యిట్లనెను. “నేను శ్రీరాముని తీసుకొని పోయెదను” ( నా భర్త పేరు రామచంద్ర). నన్ను మొదలు తీసుకెళ్ళమని నేను బాబాను వేడుకొంటిని. అప్పుడు బాబా, నేను (చంద్రాభాయి) చేయవలసిన పనులు చాలా యున్నవని అనిరి. కనుక నేను బ్రతికి యుండాలనిరి. ఈ విషయము నేను నా భర్తతో చెప్పగా ఆయన ఈ విషయమును తేలికగా తీసుకొని ఇది కలయే కదా ! అనిరి. ఇది జరిగినది చాతుర్మాసమునకు 3 నెలల ముందు. కొద్ది కాలము తరువాత నా భర్తకు మూత్ర పిండములు జబ్బువచ్చెను. ఆ తరువాత ఎక్కిళ్ళు జబ్బు వచ్చెను. ఆయనకు మరణము దగ్గరపడుచున్నది. ఈ విషయము ఆయన గ్రహించి తన మరణము చాతుర్మాసము అయిన తరువాత వచ్చిన బాగుండుననుకొనిరి. ఆయనను చాతుర్మాసము అయినపోయినంతవరకు బ్రతికించమని నేను సాయిబాబాను వేడుకొంటిని. మరసటి రోజు నుండి ఆయన ఆరోగ్యము కొంచెము కుదుటపడినది. చాతుర్మాసము అయిపోయిన

7 రోజులు గడిచినది. కార్తీక పౌర్ణమీ వచ్చినది. ఈ రోజు అర్ధరాత్రి నా భర్త కొంచెము 'టీ' సేవించిరి. విష్ణుసహస్రనామము బిగ్గరగా చదువమనిరి. వారికి నేను గంగాజలము కొంత యిచ్చితిని. వారు లేరి కూర్చునుచూ శ్రీరామ, శ్రీరామ యనుచు తుది శ్వాస వదిలిరి. ఈ విధముగా భగవంతుని స్మరిస్తూ నా భర్త మోక్షమును పొందిరి. వారు తన కోరిక ప్రకారము "చాతుర్మాసము" తరువాత పోవుట, కేవలము సాయి కరుణయే.

నా భర్త మరణానంతరము నా కుమారుని మరియు మా గృహమును చూచుకొను బాధ్యత నాపై బడినది. నా బంధువులు కొందరు మా ఇల్లు కాజేయాలనే ప్రయత్నము చేయగా సాయిబాబా మమ్ములను వారి బారి నుండి రక్షించెను. సాయికృపతోనే నా జీవితము కొనసాగుచున్నది.


## శ్రీసాయి ప్రచార ప్రతినిధులు కావాలి

**శ్రీసాయిదర్శన్, శ్రీసాయిదర్శన్ చారిటబుల్ ట్రస్ట్ తరుఫున మీ గ్రామములో / మీ పట్టణములో నిస్వార్ధసేవ చేయగల మహనీయులు కావలెను. వివరములకు ఈ దిగువ అడ్రసుకు వ్రాయండి.**

**SRI SAI DARSHAN CHARITABLE TRUST**
**Dammaiguda ,**
**Hyderabad - 500 083**
**Phone : 040-65640220**
**Cell : 98667 48099**




# శ్రీ శిరిడీ సాయి సత్యవ్రతం

సికింద్రాబాదులోని శ్రీశిరిడిసాయి సేవా సమాజం వైస్‌ఛైర్మన్, శిరిడిసాయి అంకిత భక్తులు శ్రీ యమ్.రాజేశ్వర్‌రావుగారి ఇంటిలో 3-8-2008, ఆదివారం ఉదయం 9 గం॥ల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీశిరిడిసాయి సత్యవ్రతం చక్కగా కనులవిందుగా నిర్వహించబడింది.

ఈ పరమపవిత్ర సాయివ్రతంతో బాటు విఘ్నేశ్వరపూజ, నవగ్రహపూజకూడా పూజారి శ్రీశాస్త్రిగారిచే జరుపబడినది.

శ్రీరాజేశ్వరరావుగారు మరియు వారి ధర్మపత్ని కృష్ణవేణి పుణ్యదంపతులు వ్రతంలో పూజను నిర్వహించగా మిగతా భక్తులంతా కనులారా తిలకించారు.

**1. శ్రీకృష్ణావజ్ఝల రాజేంద్రప్రసాద్‌గారు. 2. శ్రీ శంకరయ్యగారు 3. శ్రీ యమ్.పి.సాయినాథ్‌గారు 4. శ్రీ రావాడ గోపాలరావుగారు 5. శ్రీమతి అనంత లక్ష్మిగారు 6. శ్రీ అన్నవరపు కుమార్‌గారు 7. శ్రీశివకుమార్ గౌడ్ గారు. 8. శ్రీ మహేశ్‌గారు 9. శ్రీ వెంకటేశ్వర్ రెడ్డిగారు 10. శ్రీ కనకాచారిగారు మొదలైన ప్రముఖ శిరిడీ సాయి భక్తులు హాజరైనారు.**

వ్రతం పూర్తయిన అనంతరం శ్రీకృష్ణావజ్ఝల రాజేంద్రప్రసాద్‌గారు నారదీయపద్ధతిలో తనదైన ప్రత్యేకశైలిలో బాబాకు సమకాలీన భక్తులైన చోళ్కర్ మరియు భీమాజీపాటిల్ గురించి, వారి అంకిత భావాలు, సేవల గురించి ఎన్నో నిగూఢవిషయాలను సుస్పష్టంగా వివరించారు.



సాయిబానిస శ్రీ రావాడ గోపాలరావుగారు మాట్లాడుతూ ఈ రోజు ఇక్కడకు స్వయంగా సాయిబాబావారు సూక్ష్మరూపంలో వచ్చారని తెల్పారు. ఈ మాటను విన్న శ్రీ రాజేశ్వరరావుగారు "ఎన్నో రోజులనుండి కూడా ఈ వ్రతం చేయాలని అనుకున్నప్పటికిని, చేయలేకపోవడం, అందుకు శ్రీబాబావారు ఈ రోజు రావడానికే ఇది వాయిదా వేయబడింద"ని ఎంతో సంతోషించారు.

శ్రీమతి అనంతలక్ష్మి మాట్లాడుతూ చంపాపేటలోని శ్రీశిరిడిసాయి బాబా మందిరంలో 108 రోజుల సాయినామ స్మరణ తేదీ 24-7-2008 నుండి ప్రారంభమవుచున్నట్లు తెల్పింది. భక్తులందరిని రావల్సిందిగా ఆహ్వానించారు.



చివరగా శ్రీరాజేశ్వరరావుగారు పిలవగానే వచ్చినటువంటి అహ్వానితులందరని పేరు, పేరున పరిచయం చేస్తూ అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీశివకుమార్‌గారు రచించిన "స్వామీజీ నా దివ్యస్మృతులు", యోగిరాజ్ వ్రాసిన ఆంగ్ల గ్రంథం Yoga Techniques మరియు డా॥ అన్నవరపు కుమార్‌గారు వ్రాసిన "సాయి వికాసతరంగణి" అనే గ్రంథాలను ఉచితంగా అక్కడకి వచ్చిన భక్తులకు పంచిపెట్టారు.

శ్రీమతి అనంత లక్ష్మీగారు తాను రచించిన "అక్కల్‌కోటస్వామి" మరియు "సాయివ్రతకల్పం" అనే గ్రంథాలను భక్తులకు పంపిణీచేశారు.

సమయాభావం వలన శ్రీ యమ్.పి.సాయినాథ్‌గారు, శ్రీశంకరయ్య గారు, శ్రీ అన్నవరపు కుమార్‌గార్లు మాట్లాడలేదు.


చివరిగా శ్రీరాజేశ్వరరావుగారి సతీమణి శ్రీమతి కృష్ణవేణమ్మ, కూతురు శ్రీమతి గీత, కోడలు శ్రీమతి సునిత తాము స్వయంగా వండిన రుచికరమైన భోజనాలను బాబావారి మహాప్రసాదంగా అందించారు. వచ్చిన భక్తులంతా తృప్తిగా భోజనంచేసి ఆనందోత్సాహాలతో తమ ఇండ్లలో కూడా ఒకసారైనా సాయివ్రతాన్ని ఇదే విధంగా జరుపుకోవాలని కోరుకున్నారు. ఇందుకు శ్రీరాజేశ్వరరావుగారే స్ఫూర్తిదాత. అందరూ ధన్యవాదాలు తెలియజేసి నిష్క్రమించారు.

ఈ వ్రతం శ్రీ రాజేశ్వరరావుగారి జీవిత ప్రయాణంలో గుర్తుంచుకోవల్సిన మైలు రాళ్ళలో ఇదొకటి.


# శ్రీకృష్ణ సాయి పరమాత్మ

రచన : **కొప్పిశెట్టి సూర్యనారాయణ,** పి.ధర్మవరం, విశాఖజిల్లా

శ్రీకృష్ణ పరమాత్మను 'కృష్ణం వందే జగద్గురుమ్' అని స్తుతిస్తూ, మన జీవితాలను పవిత్రతతో ధన్యం చేసుకొని తరిస్తూఉంటాం!



'శ్రీకృష్ణుడు' అంటే పరమాత్మ అనే అర్థం ఉంది. కనుకనే ఏ దైవానికి కూడా పేరు చివరన చేర్చని 'పరమాత్మ' అనే పరిశుద్ధ పదాన్ని ఒక్క శ్రీకృష్ణునికే చేర్చి 'శ్రీకృష్ణపరమాత్మ'గా తమ హృదయాలలో పదిలపరచు కొంటారు ఆయన భక్తకోటి ! మన పురాణాలన్నింటిలో కూడా శ్రీకృష్ణపరమాత్మకున్న విశిష్టత ఏ దైవానికీ లేదనే చెప్పవచ్చు. ఎందుకంటే సర్వజనులతో కలిసి, ఆడి, పాడి, తిని, తిరిగి, తన అవతారం పూర్తయ్యేవరకు లీలా మానుషవిగ్రహునిగా సృష్టిలో విలీనమైనవాడు ఒక్క శ్రీకృష్ణపరమాత్మయే !



ఈ శ్రీకృష్ణపరమాత్మకూ, మన సాయి పరమాత్మకు గల అత్యంత సామాన్యాన్ని పరిశీలిస్తే భక్తులకు అర్థం కాక మానదు. శ్రీకృష్ణపరమాత్మ ఉండేది 'ద్వారక' ! అంటే ప్రశస్తమైన ద్వారములతో కూడినదట. ఈ ఉత్తమ ద్వారాలను దాటుకొని, ప్రవేశిస్తే మనకు లభించేది - శ్రీకృష్ణపరమాత్మ యొక్క దివ్యమంగళ స్వరూప సందర్శనము ! ఆయన సామాన్యుడు కాడు ! మాయి! అంటే గారడి



చేసేవాడు ! ఇంద్రజాలికుడు ! అనగా ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లుగా గోచరింపజేసేవాడు !

'శ్రీసాయి పరమాత్మ'కూడా ఉండేది 'ద్వారకామాయి'లోనే! చూసారా ! సాయి తానుండే మసీదుకి 'ద్వారకామాయి' అని పేరు పెట్టడంలో గల అంతర్యం ఏమిటంటే - ఆ మశీదు (ద్వారక)లో ఉండేవాడు కూడా 'మాయి'యే! అంటే శ్రీకృష్ణునివలె సామాన్యులకు అంతుచిక్కనివాడే ! 'మాయి' అంటే 'బ్రహ్మ' అనే అర్థం కూడా ఉంది. దీనినిబట్టి ద్వారకా నివాసుడైన శ్రీకృష్ణపరమాత్మకూ, ద్వారకామాయిలో నుండే సాయి పరమాత్మకూ సామ్యం ఉందని గ్రహించాలి !

'మాయలు' చేసేవాడు 'మాయి !'. 'మాయ' అంటే యదార్థము కానిది! వేదాంతపరంగా ఆలోచిస్తే 'అవిద్య!' అంటే తెలియబడనిదే 'మాయ' అన్న మాట!

ఈ 'మాయ' (అవిద్య) వలన కలిగిన భ్రాంతి చేత అసత్యమైన జగత్తును సత్యముగాను, బ్రహ్మముకంటె వేరైనదిగాను జనులు గ్రహిస్తారు. ఏది నిత్యమో, ఏది అనిత్యమో తెలియలేరు. 'మాయా మోహ జగంబె నిత్యమ'ని భ్రమిస్తారు ! ఇదే మాయకు అర్థం.

కాబట్టే 'ద్వారకామాయి'లో ఉండేవాడు 'సామాన్యయోగి' కానేకాడు ! ఆయన జగద్గురువైన సాయీశ్వరుడే ! అని కూడా ఆనాడు చాలామంది గ్రహించలేకపోయారు ! మరి శ్రీకృష్ణుని కూడా ఆనాడు చాలామంది సామాన్యమానవునిగానే గదా తలంచారు.

బృందావనంలో తనకై వేంచేసే గోపికలను శ్రీకృష్ణుడు "అత్యంత భాగ్యశాలులారా ! రండి ! మీ కిదే నా స్వాగతం !" అని ఆహ్వానించేవాడట!

సాయి కూడా తన దర్శనం కోసం విచ్చేసిన భక్తుల్ని "రండి ! మహాత్మా! రండి ! మీ దర్శనం కోసమే ఎదురుచూస్తున్నాను." అని స్వాగతించేవారట!

శ్రీకృష్ణపరమాత్మ తన భక్తులతో "ఓ గోపికలారా ! భక్తి ప్రపత్తులతో మీరు నన్ను కట్టేసారు! నేను మీకు ఋణగ్రస్తుడనైపోయాను. ఎన్నెన్ని జన్మలెత్తి,

మీకు పాదసేవ చేసినప్పటికీ కూడా నేను ఋణవిముక్తుణ్ణి కాలేను! ఓ భక్త శిఖామణులారా ! మీ పాద ధూళితో ఒక్కరేణువునై జన్మించానా సరే – అది నా భాగ్యమనే భావిస్తున్నాను!" అని ఆప్యాయంగా అనేవాడట !

మన సాయి పరాత్పరుడు కూడా "ఓ భక్తులారా ! నేను మీకు ఋణగ్రస్తుడనే ! మీ దర్శనం వలననే నా జన్మచరితార్థమై యున్నది. మీ సేవల వలననే నిత్యము, సత్యమూ అయిన ఆనందం కలుగుతున్నది. భక్తులకు నేను బానిసను కావడమే నాకున్న ఏకైక లక్ష్యము!" అనేవారట.

ఆహా ! ఇదే, ఇదే కదా భగవంతునియొక్క తత్త్వము. భగవంతుడు తన భక్తునికి నిజంగా బానిసయే ! శ్రీకృష్ణుడు, కుచేలుడు మొదలైన తమ భక్తులకు ఎలాంటి సేవలు చేసాడో మనం తెలుసుకున్నాం. ప్రతి క్షణం తన భక్తులకు రక్షణగా ఉండేవాడు. అలాగే తనను త్రికరణశుద్ధిగా నమ్మిన పాండవులకు, అందునా అర్జునునికి చివరకు రథాన్ని నడిపే సూతునిగా కూడా వ్యవహరించి, ఈ లోకాన్నే నడిపిన జగద్గురువు. శ్రీకృష్ణుని మించిన కారణజన్ములు ఎవరైనా ఉన్నారా!

సాయినాథుడు కూడా సృష్టిలో గల జీవులన్నింటితో అత్యంత సన్నిహితముగా ప్రవర్తిస్తూ మనకు తెలియకుండానే లీలామానుషవిగ్రహుడై సర్వజగత్తునూ నడిపిస్తూ, అందర్నీ సన్మార్గులుగా తీర్చిదిద్దుతూ అనుక్షణం నాటినుండి నేటి వరకూ సర్వజీవలోకాన్నీ సంరక్షిస్తున్న సాయి 'పరమాత్మ'యేనని భక్తులకు తెలియనది కాదు.

శ్రీకృష్ణపరమాత్మ 'గోపాలుడు' ! గోవులను పాలించేవాడు అని 'గోవులు' అంటే 'పశువులు' (జీవులు)! సకల జీవులను పాలించేవాడే గోపాలుడు. సర్వజనసంరక్షకుడన్న మాట. మరి గోపికలనగా భక్తులే ! అటువంటి గోపాలునితో మమేకమై మనసా, వాచా, కర్మణా విలీనమైన భక్తజనసందోహమని అర్థం ! భగవంతునికీ, భక్తులకూ మధ్య గల నిత్యమైన, సత్యమైన మమతానురాగముల కలయికయే, ఆ అఖండమైన శాశ్వతానంద అనుభవమే శ్రీకృష్ణునికీ, గోపికలకీ



మధ్య ఉండే సంబంధం ! అటువంటి పరమార్థాన్నీ, జీవాత్మ, పరమాత్మల ఏకత్వాన్ని లీలామాత్రంగా సూచించాడు శ్రీకృష్ణుడు !

సాయీశ్వరునిలో కూడా ఈ లక్షణాలు చాలా సందర్భాలలో మనకు స్ఫురిస్తాయి. ఈనాడు కలియుగ ప్రభావితంలవల్ల కుల, మత, వర్గ, విభేదాలు పెచ్చుపెరిగాయి. సమస్తజనుల కలవరంతో పీడింపబడుతున్న సమయంలో పరమాత్మ సాయీశ్వరునిగా అవతరించి, అనాథలకు, అభాగ్యులకు మంచి గమ్యాన్ని చూపించి, 'ధర్మసంస్థాపనార్థాయ" అని నిరూపించి, శాంతి స్థాపన చేసిన పరమాత్మ సాయి!

అందుకే సాయి నివాసమున్నది 'మసీదు'లో ! అంటే ముస్లిముల దేవాలయములో ! ఆ మసీదులో జరగుతున్నది దీపారాధన ! ఇది హిందువుల సంప్రదాయము ! 'దీపము' అంటే వెలుగునిచ్చేది – ప్రాణ ప్రతిష్ఠ ! సకల ప్రాణాధారమైన సృష్టికర్తయే మసీదు (శరీరము)లో దీపారాధన చేసే సాయీశ్వరుడు! ఉండేది సర్వప్రాణులతో ! దీవించేది అన్ని భాషల్లో ! ఇంతకీ ఆయనది ఏ మతం?ఏ కులం? ఏ వర్గం ? సర్వ చరాచర జీవేశ్వరుడు ఏదైతే – అదే సాయీశ్వరుడు కూడా !

శ్రీకృష్ణపరమాత్మ పుట్టింది ఒక చోట – పెరిగింది మరొక చోట – నివసించింది వేరొకచోట ! అన్ని చోట్లు ఆయనే ! శ్రీసాయి పరమాత్మ కూడా అంతే !

**తే॥ 'ద్వారకామాయి'; ప్రమిదల 'ద్వార'కొకటె !**
**'సాయి','కృష్ణుల' అవతార సారమొకటె !**
**సర్వజీవ సంరక్షణగా సరళి యొకటె !**
**ధర్మ సంస్థాపనార్థమై ధరిణి మనిరి !**

ఓం తత్ సత్

# పురుషోత్తమ ప్రాప్తి యోగము

**శ్రీశంబాన నారాయణరావు,** డోర్ నెం.9-2/3, హాస్పటల్ రోడ్,
బొబ్బిలి - 535 558, విజయనగరం



**యస్మాత్ క్షరమతీతో2హం అక్షరాదపి చోత్తమః ।**
**అతో2స్మిలోకే వేదే చప్రథితః పురుషోత్తమః ॥ (18)**

(నేను (భగవంతుడు), క్షరుడిని మించినవాడినీ, అక్షరుడి (జీవుడు) కంటె శ్రేష్ఠుడిని కావడం వల్ల లోకంలోనూ, వేదాలలోనూ పురుషోత్తముడిగా ప్రసిద్ధిపొందాను.)

1. సంసారంను రావిచెట్టుతో పోల్చి చెప్తాడు శ్రీకృష్ణుడు. ఈ సంసారవృక్షం వేళ్ళుపై, కొమ్మలు క్రిందన వుంటాయి. దానికి నాశనం లేదు. వేదములే దాని ఆకులు. ఈ సంసారవృక్షమును తెలుసుకున్నవాడు, అంటే ఈ జగత్తుకు ఆధారము పరమాత్మయేయని తెలిసినవాడు వేదార్థమును తెలిసినవాడగును.

2. దాని (సంసారవృక్షము) కొమ్మలు సత్త్వ, రజ, తమో గుణములచే వృద్ధి చెందుతాయి. శబ్దాది విషయములు చిగుళ్ళుగా క్రిందికీ మీదికి వ్యాపిస్తాయి. మానవలోకంలో ధర్మాధర్మకర్తబంధాలే దాని వేళ్లుగా క్రిందికి బాగుగా నాటుకుంటాయి.

3. సంసార వృక్షం రూపంగాని, ఆదిగాని, మధ్యంగాని ఈ లోకంలో ఎవరికీ తెలియవు. లోతుగా నాటుకున్న వేళ్ళను వైరాగ్యమనే కత్తితో ఖండించి, పునర్జన్మ లేకుండా చేసే పరమపదాన్ని వెతకాలి.





4. అంటే ఈ సంసార వృక్షం విస్తరించుటకు కారణమైన ఆదిపురుషుడగు పరమాత్మను శరణుపొందాలి.

5. **ఈ సంసారం నుండి బయట పటుటకు సాయిచరిత్ర యిట్లా చెప్తుంది...**

బుద్ధిమంతులు, జ్ఞానులు, పండితులు అహంకారముచే సంసారమనే గోతిలో పడెదరు. సముద్రము లేక నదిని దాటేటప్పుడు ఓడ నడిపే వానిపై నమ్మకముంచినట్లు, సంసార సాగరమును దాటుటకు సద్గురువు (బాబా) పై పూర్తి నమ్మకం వుండవలెను. భక్తుల యొక్క మనోభావాలను గ్రహించి, వారిని సన్మార్గమును బోధించి, జీవిత పరమార్థమును తెలియజేసెడివారు.

6. శాంతిని ప్రసాదించే ముందు బాబా తన భక్తులకు అహంకారం అంటకుండా వుండేటట్లు జాగ్రత్త తీసుకునేవారు. ఎట్లనగా....

దాసగణు హరికథలు (భగవంతునకు సంబంధించిన కథలు) చెప్పెడివాడు. ఒకరోజు తలపై టోపీ, పొడవైన కోటు, లోపల చొక్కా, పైన ఉత్తరీయము, ధోవతిని కట్టుకొని, హరికథ చెప్పుటకు బయలుదేరుతాడు. బాబాను అనుమతి అడుగుటకు మశీదుకు వెళ్తాడు. "ఏమోయ్ పెండ్లికొడుకా ! ఇంత చక్కగా ముస్తాబై యెక్కడకు పోవుచున్నావు?" అంటారు బాబా. హరికథ చెప్పుటకని దాసగణు చెప్తాడు. "దానికి అలంకారమెందులకు? కోటు, కండువా, టోపి తీసివేయుము" అంటారు బాబా. వాటిని తీసి బాబా పాదాల దగ్గరు వుంచుతాడు దాసగణు. భగవంతునికి సంబంధించిన కథలు (హరికథ) చెప్పేటప్పుడు అందంగా అలంకరించుకొనుట అహంకారమవుతుంది. అందుకే బాబా దాసగణుని మందలిస్తారు. హరికథలు

ప్రారంభించిన నారదమహర్షి తలపైన, శరీరంపైన నడుమువరకు ఎలాంటి వస్త్రములు ధరించక పోవుట అహంకారం లేకపోవుటను తెలియజేస్తుంది.

7. కొందరు దేవాలయాలకు వెళ్ళేటప్పుడు అందంగా అలంకరించుకొనుట అహంకారమే అవుతుంది కదా !

8. పురాతన దేవాలయాలలో గర్భగుడి ద్వారములు ఎత్తు తక్కువగా (పొట్టిగా) వుంటాయి. దాని వలన గర్భగుడిలోకి ప్రవేశించేటప్పుడు తలవంచుకుంటాము. అంటే అహంకారము వదిలిపెడతాము.

**8. గీతనుండి...**

అభిమానము, అవివేకము లేకుండా ఆత్మజ్ఞానమందు నిష్ఠగల వారును; కోరికలు విడిచిపెట్టి, సుఖదుఃఖాల నుండి విడువడినవారును శాశ్వత బ్రహ్మపదమును పొందుతారు.

10. **"దేనిని పొందితే సంసారమునకు తిరిగిరారో అదియే నా యొక్క శ్రేష్ఠమైన స్థానం"** అంటారు శ్రీకృష్ణుడు.

11. నిత్యమగు నాయొక్క ఒక అంశమే మానవలోకంలో జీవాత్మగా ప్రకృతిలోని జ్ఞానేంద్రియాలను, మనస్సును ఆకర్షించు చున్నది అంటాడు శ్రీకృష్ణుడు.

12. భక్తులను ఆకర్షించుటయేగాక, నిరాడంబర భక్తులకు కానరాకుండానే కరుణించి రక్షిస్తారు బాబా. కాని దానిలోఎట్టి సంబంధం లేనట్లు కనిపిస్తారు.

13. వాయువు పుష్పముల నుండి వాసనలను తీసుకుపోయేటట్లు జీవుడు శరీరంను వీడినప్పుడు కొత్త శరీరమును ధరించేటప్పుడు మనస్సును, ఇంద్రియాలను, వాని యందుండు సంస్కారములను వెంట తీసుకొనిపోతాడు అని గీత చెప్తుంది.

**14. గీత చెప్పిన దానిని ధ్రువీకరిస్తూ సాయిచరిత్రలో యిట్లా చెప్పబడింది...**



గత జన్మలో శత్రువులైన వీరభద్రప్ప, చెన్నబసప్పలు పాము, కప్పగా జన్మించినప్పటికి, పూర్వ సంస్కారం వలన శత్రుత్వంతో కప్పను పాము పట్టి చంపుటకు ప్రయత్నిస్తుంది. పూర్వజన్మ శత్రుత్వమును తెల్పుతూ పాము బారినుండి కప్పను రక్షిస్తారు బాబా.

**15. గీత నుండి...**

ఆత్మ సాక్షాత్కారమునకై ప్రయత్నించే యోగులు తమలోని ఆత్మను దర్శిస్తారు. చిత్తశుద్ధి లేని అవివేకులు ఈ ఆత్మను చూడలేరు.

16. సమస్త జగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సును, చంద్రుని తేజస్సును, అగ్ని తేజస్సును నా తేజస్సే అంటారు శ్రీకృష్ణుడు.

**17. శ్రీసాయి సచ్చరిత్ర నుండి...**

శిరిడీ వర్తకులు కూడపలుకుకొని, దీపారాధనకు బాబాకు నూనె యివ్వరు. బాబా నూనె పాత్రలో నీళ్ళుపోసి, ఆ నీటితో దీపాలను వెలిగిస్తారు. దీనిని బట్టి దీపాల తేజస్సు బాబా తేజస్సని రూఢి అవుతుంది.

**18. గీత నుండి...**

'వైశ్వానరుడు'నయి 'జఠరాగ్ని'రూపంలో ప్రాణుల యొక్క శరీరములను ఆశ్రయించి, ప్రాణాపాన వాయవులతో కలిసి,నాలుగు రకాల ఆహారాలను జీర్ణం చేస్తున్నాను.

19. సర్వప్రాణులకు నావలనే జ్ఞాపకము, జ్ఞానము, మరుపు కలుగుతాయి.

20. ఈ ప్రపంచంలో క్షరుడు, అక్షరుడు అను యిద్దరు పురుషులు కలరు. సమస్త ప్రాణుల దేహముల యొక్క అభిమాని క్షరుడు. మనస్సు యొక్క అభిమాని (కూటస్థుడగు జీవుడు) అక్షరుడు.

21. ఈ ఉభయుల కంటే శ్రేష్ఠుడు, సర్వవ్యాపి, శాశ్వతుడు అగు పరమాత్మ (పురుషోత్తముడు) కలడు. వాడే నేనని తెలియజేస్తూ అర్జునునకు ఉపదేశిస్తాడు

శ్రీకృష్ణుడు.

22. మన పాపములను పారద్రోలు పరబ్రహ్మ స్వరూపమే బాబా అని సాయిసచ్చరిత్ర చెప్తుంది.

పాపముల నుండి విముక్తిని, శరీరమును, వాక్కు (మాట)ను, మనస్సును బాబా పాదములకు సమర్పించి వారి నామజపం చేయాలి. సాత్త్విక గుణములు ప్రాధాన్యత వహిస్తాయి. దానితో శాశ్వత, అశాశ్వతులకు గల భేదమును, వ్యామోహంలేక పోవుటను, జ్ఞానమును తెలిసికొంటాము. ఈ స్థితిలో గురువుని ధ్యానించవలెను. ఇది గురువునకు సర్వస్య శరణాగతి అవుతుంది. దీని మూలంగా శాంతి, అభిమానము లేకపోవుట, కీర్తి తరువాత మోక్షము ఒకటి తరువాత ఇంకొకటి సంక్రమించును.

23. "భక్తి శ్రద్ధలతో మనఃపూర్వకముగా నన్నే ఆరాధించువారి యోగక్షేమము నేను చూచెదను" అంటారు బాబా.

24. సంసారం మహాసాగరం అంటారు. మహాసాగరంను దాటగలము. కాని సంసారంను దాటుట కష్టం. సంసారి జన సమూహంలో కలిసి మెలసి బ్రతకాలి. వారిలో బంధువులుంటారు. వారివలన అతనికి భగవంతునిపై భక్తి కుదరదు. కాని బాబా ఎంతోమంది సంసారులకు మోక్షప్రాప్తిని కలుగజేసారు. కావున బాబాను ఆశ్రయించిన సంసార సముద్రమును దాటించగలరు.

సద్గురు శ్రీసాయి పాదుకార్పిత మస్తు

శుభం భవతు





( 'సాయిభక్తమాల' అను గ్రంథము నుండి .... )

# 8. బాలా సాహెబ్ మిరికర్

చరణ్ జనమంచి

*(గత సంచిక తరువాత భాగం)*



**అసలు పేరు : బాలా సాహెబ్ మిరికర్**

**వృత్తి : మమలతదారు**

బాలాసాహెబ్ మిరికర్‌కు బాబా యందు భక్తియుండేది. ఇతను కోపర్‌గాంలో మమలతదారుగా ఉండెను. ఉద్యోగరీత్యా చితళి గ్రామం పోవుచూ మధ్యలో సాయిబాబాను చూడటానికి షిరిడీకి వచ్చెను.

బాబా మిరికర్‌తో **"నీకు ఈ ద్వారకామాయి తెలుసుగదా! మనము ప్రస్తుతమున్నది ద్వారకామాయిలోనే. ఆమెను చేరిన భక్తులెవ్వరికి ఏ కష్టములుకాని, ఏ ప్రమాదములు కాని రావు"** అనెను. బాబా మాటలు మిరికర్‌నకు సరిగ్గా అర్థం కాలేదు. అది గ్రహించిన సాయిబాబా ఊధి ప్రసాదం ఇచ్చి మిరికర్ తలపై చేయివేసెను. పాము సంకేతమును బాబా చేతితో చూపిస్తూ దానినుండి ప్రమాదం రాబోతున్నదని, కాని భయమేదీలేదని, ఈ ద్వారకామాయి కాపాడునని, శ్యామాను వెంట

తీసుకెళ్ళు'' అని బాబా మిరికర్‌నకు తెలిపెను. మిరికర్ శ్యామాను నిరాకరించెను. మరల సంశయంతో బాబా మాట ప్రకారం శ్యామాను తీసుకెళ్ళను. చితళీకి రాత్రి 9 గం॥ వెళ్ళెను. అక్కడ చీకటిగా నున్నది. పాము మిరికర్ దుప్పటి కింద కదులుతుండగా, ఆ శబ్దం అక్కడి నౌకరు విని లాంతరు తెచ్చి చూచి 'పాము పాము' అని అరచెను. దానిని చంపిరి. జరుగబోయేది బాబా ముందుగానే సంకేతరూపంలో తెలియజేసినందుకు మిరికర్ బాబాకు మనసున కృతజ్ఞతలు తెలిపెను. (సశేషం)

## సాయిరాం

ప్రసన్నసాయి, రాజంపేట

సాయినాథా సదా నిన్నే పూజింతు
సాయినాథా సదా నిన్నే ధ్యానింతు
సాయినాథా సదా నిన్నే సేవింతు
సాయినాథా సదా నిన్నే స్మరియింతు
సాయినాథా సదా నిన్నే స్తుతియింతు
సాయినాథా సదా నిన్నే కీర్తింతు
సాయినాథా సదా నిన్నే ప్రేమింతు
సాయినాథా సదా నిన్నే ఆరాధింతు
సాయినాథా సదా నిన్నే అన్వేషింతు
సాయినాథా సదా నిన్నే మది తలతు
సాయినాథా సదా నిన్నే భజియింతు





# వందనం శ్రీసాయినాథా !

– యం. మాధురి సాయిరామ్



'నమస్కారం' అనేది మన సంస్కృతి, సంప్రదాయాలకు అనాదిగా ప్రతీకగా నిలుస్తుంది. ఇదొక వందన చిహ్నం. ఒక గౌరవ సూచకం. తల్లిదండ్రులకు, గురువుకి, అతిథులకు అందరికంటె ప్రధానమైన దైవానికి నిత్యం నమస్కారం చేయడం అలవర్చుకోవాలి. అందుకే మన పూర్వీకులు ఇలా ప్రవచించారు.

"మాతృదేవోభవ ! పితృదేవోభవ ! ఆచార్యదేవోభవ ! అతిథి దేవోభవ!" అని సంస్కారానికి ప్రతీకమైన నమస్కారం ఎలా ఉండాలి అనే సందేహం మనకు కలగడం సహజం. మనసునిండా గౌరవాన్ని నింపుకొని, వినయం విధేయత ఉట్టిపడేలా హృదయాన్ని స్పృశించాలి. అందుకే అన్నారు నమస్కారానికి హృదయభాష అని. నమస్కారం చేసేటప్పుడు ఉచ్చారణలో తేడా వచ్చినా, అభినయంలో అపశృతి దొర్లినా స్వీకరించేవారి మనస్సు చివుక్కుముంటుంది సుమా!

గురుబ్రహ్మ ! గురుర్విష్ణుః ! గురుర్దేవో మహేశ్వరః ।
గురుసాక్షాత్ పరబ్రహ్మ ! తస్మై శ్రీగురవే నమః ।

'గురువు' ఉచ్చారణ కాస్తా గురూ! గా మారింది. వర్తమానంలో ఆ శబ్దానికి ఎంత అవమానం జరిగేదో ఆలోచించండి !

ఈ కాలంలో 'నమస్కారం' అనే వందనం వంద రూపాయలుగా మారిపోయింది. సత్ప్రవర్తన అలవడాలంటే చెడును విస్మరించాలి. వినయ పూర్వకంగా ప్రశాంతవదనంతో "నమస్కారమండీ" అనాలి. అంతేగాని వ్యంగ్యంగా

పలుకరాదు. చూడగానే మనమెవరిమో, మనమేమిటో ఎదుటవారికి తెలియదు కదా ! వినయాన్ని వినమ్రతను చాటుకోవాలంటే నమస్కారాన్ని స్వీకరించేవారి హృదయాన్ని స్పృశించేలా గౌరవ భావంతో చేయాలి.

నమస్కారం ఎలా చేయాలో చూద్దామా !

శివకేశవులకు నమస్కారం చేసేటప్పుడు శిరస్సు నుంచి 12 అంగుళాల ఎత్తున చేతులు జోడించి నమస్కరించాలి.

హరిహరులకు తప్ప మిగతా దేవతలకు శిరస్సు మీద చేతులు జోడించి నమస్కరించాలి.

గురువుకి నమస్కరించేటప్పుడు ముఖానికి నేరుగా చేతులు జోడించి నమస్కరించాలి.

తండ్రికి, పెద్దలకు నమస్కారం నోటికెదురుగా చేతులు జోడించి చేయాలి.

తల్లికి నమస్కరించేటప్పుడు ఉదరమున నేరుగా చేతులు జోడించి నమస్కరించాలి.

యోగులకు, దైవాంశ సంభూతులకు, మహానుభావులకు వక్షస్థలం వద్ద చేతులు జోడించి నమస్కరించాలి.

గురువూ, దేవుడూ ఒకేసారి ప్రత్యక్షమైతే ముందు మనం ఎవరికి నమస్కారం చేయాలనేదేగా మన సందేహం. ప్రథమంగా మనం గురువుకే నమస్కారం చేయాలి. ఎందుకంటే మనకు భగవంతుని చూపించింది గురువే కదా !

సాయిబాబా సద్గురువు. బాబా రూపం మహోదత్కృష్టం. బాబా భక్తులకు ఆశ్రయస్థానం. కోరికలు తీర్చే కల్పవృక్షం. కరుణించే కామధేనువు.

సాయిబాబాను కొందరు భగవద్భక్తు డంటారు.

మనకు మాత్రం బాబా సాక్షాత్ భగవంతుని అవతారమే. భక్తి,శ్రద్ధ,



ఓర్పులే ఆసనాలు. బాబా షిరిడీలో వున్నా సర్వాంతర్యామి సచ్చిదానంద స్వరూపం సాయినాథునిది. శ్రీసాయి సద్గురువుకు సాష్టాంగప్రణామములు. శతకోటి నమస్కారములు ! వందనం శ్రీసాయినాథా ! మనందరం ఈ విధంగానే నమస్కారం చేద్దాం మరి ! ఇదండి నమస్కారానికి సద్గురువు సాయినాథుడు ప్రవచించిన భాష్యం. ▯

# జీవిత సత్యం



రచన : **పర్వతం రేవతీ ప్రసాద్,** ప్లాట్ నెం.115,
డిఫెన్స్ కాలనీ, సైనిక్‌పురి, హైద్రాబాద్ – 500 094.

ప॥ నదులు అన్ని కదిలి కలిసితే సాగరం ।
నడి సంద్రాన నావే జీవితం ।
తరలి పొరలు కెరటాలు అన్ని పునర్జన్మాలు,
ప్రతి మనిషీ సాధనకు ఇవే సంకేతాలు ॥ నదులు ॥

చ॥ పుట్టినపుడు లేని సిరి – పోవునపుడు రాని సిరి ।
నడిమంత్రపు సిరియైనా – ఎవరి వెంట రాదు మరి ।
మావి మావి అనుకొన్నవి – మాయలని తెలుసుకొని ।
మనుజులంత పొందాలి – గతం నుండి విముక్తిని । ॥ నదులు ॥

చ॥ వృక్షములు ఫలములిచ్చు – తరువులన్ని విరులనిచ్చు ।
మాతయు, గోమాతయు – శిశువులకు పాలనిచ్చు ।
చేయునది కేవలము నిస్వార్థ సేవనము ।
ప్రతి ఫలమే ఆశించక – గడుపు గద జీవనము । ॥ నదులు ॥

చ॥ ఆకలి అందరికొకటే – దాహం అందరి కొకటే ।
అనుభవించేనాడు వేదన, అందరి కొకటే ।
ఆధ్యాత్మిక చింతనము – జీవికి సంజీవనము ।
**అందరికి ఆధరువు – సాయే గద కల్పతరువు ।** ॥ నదులు ॥
▯

# శ్రీసాయినాథ భజనమాల

మూలము :శ్రీరఘునాథ్ , శ్రీమతి సావిత్రి బాయి టెండూల్కర్‌దంపతులు
తెలుగుఅనువాదం : శ్రీ రెంటాల విశ్వేశ్వరరావు, శ్రీమతి ఇందిరా కస్తూరి,
నరసారావుపేట, గుంటూరుజిల్లా

(గత సంచిక తరువాయి భాగం)



(41) ప్రాపంచిక కష్టములు సంభవించినప్పుడు సద్గురు నామజపము చేత వానిని అధిగమించవచ్చును. భక్తి, విశ్వాసములతో కూడిన ఆ నామజపము మిత్రులు, దాయాదులు తీర్చలేని దుఃఖములను సైతము తీర్చును. కనుక సద్గురు నామజపమును విడనాడకుము.

(42) ఓ మనసా! గడచిన కాలము తిరిగిరాదని గ్రహించుము. చప్పరించుకొలదియు మధురరసమును ఇచ్చు కలకండముక్క వంటిదే నామజపము. జీవుడు పరమాత్మయైన శివునియందు తల్లీనమై దొంగవలె ఎవరికినీ కనుపించక ఊగుతూ ఉంటాడు. నామామృతమును గ్రోల సిద్ధముగా నుండమని, యీ దాసుడు చెప్పుచున్నాడు.

(43) పప్పు, కూరలతో నుండు సాధారణ భోజనము శరీరమునకు హాని కలిగించదు. మృష్టాన్నము కష్టముల పాలుచేయును. కఠినపదజాలములు



లేని నామస్మరణయే శ్రీహరికి ఇష్టము. బాబా నామముగాని, రూపముగాని ఎంత సీదా, సాదానో మీరెరుగనివా ? బాబా ! నీ నామగానమును కర్ణపేయముగా చేయుచు, నీ చరణముల యొక్క పూజ జరుపుతూ మేము ఆనందింతుము గాక! నీవే నా పాలకుడవు, తల్లివి మరియు నా తండ్రివి. మాకు నీ నామశ్రవణము, మననమునందే సుఖ,శాంతులు లభించునట్టి భాగ్యమును ప్రసాదించుము తండ్రీ!

(44) శ్రమజీవి ఇంట లక్ష్మీనివాసముండును. సోమరి ఇంట జ్యేష్టాదేవి (దరిద్రము) కాపురముండును. గురువే గోవిందుడు; గోవిందుడే గురువు. మానవుని జీవితమున చంచలమైన మనస్సు, భక్తి, ముక్తి మరియు సమాధానములు కలుగునట్లు చేయజాలవు. భగవన్నామ సంకీర్తనము చేయుచూ మనసును స్థిరపరుచుకొమ్మని ఈ భక్తుని సలహా.

(45) మానవా ! నీ గురువును నీవే ఎంచుకొనుము. ఈ మాయామేయ జగత్తు నందు 'నేను,' 'నాద'ను భావము (Ego) ను వదులుము. సద్గురు చరణసేవ ద్వారా, జీవన్మరణ సుఖదుఃఖములను అధిమించుము. సద్గురుడైన బాబాయే నీ మోక్షప్రాప్తికి దారిచూపును. అదియే సరియైన బేరము.

(46) భక్తజనసందోహము జరుపు బాబా యొక్క ఉత్సాహభరితమైన ఉత్సవము అనెడి కోలాహలము సోమరితనమును దరిదాపులకు కూడ చేరనీయదు కదా! నోరార బాబాను కీర్తించు షిర్డీని దర్శించి కృతార్థుడవు కమ్ము. అభిషేకము తర్వాత బాబా నడుమునకు పీతవస్త్రము కట్టి భక్తులు

భజనచేయగా, ఆయనే మాధవుడు అనిపించుచున్నది. ఈ విషయములను మనన చేసికొన్న ఈ దాసుని మనస్సు ఆనందపరవశమగుచున్నది సుమా!

(47) స్వామీ ! నాకు ఇల్లు, వాకిలి, సంసార జంఝాటకము వద్దు. పునర్జన్మ అసలేవద్దు అని కోరుటయే జీవిత పరమావధి. ప్రపంచమను నాటకరంగమునకు నీవే సూత్రధారుడవు. ప్రాపంచిక విషయములలో చిక్కి కష్టముల పాలగుట నాకిష్టము లేదు. దేవా ! నా కఖండ శాంతిని ప్రసాదించుము.

(48) సాయీ ! నీపై భక్తి, ఇహముపై విరక్తి రెండును గొప్పవే. నీ భక్తులకు తల్లివలె ప్రవర్తించి మా ఐహిక సుఖముల యెడ విముఖతను కలుగజేసి, నీయందు ఐక్యము చేసికొందువు. నీవే భక్తులను పరీక్షించుటకు కష్టముల పరంపరలను, సుఖముల దొంతరలను కలుగజేయుదువు. సానబట్టని వజ్రము ప్రకాశించదు కదా! ఋషులు, మునులు, సత్పంగులు సాధించలేని దానిని సమర్థుడైన సాయి నాకనుగ్రహించుగాక! ప్రభూ! నీ దర్శనభాగ్యము కలుగుటకై నేను ఆర్తితో నీ చరణములను నాశ్రయించుచున్నాను.

(49) ఓ పామరుడా ! జనన మరణములు, సంపద మరియు సంతతి ప్రభువు యొక్క ఇచ్ఛానుసారము జరుగుచుండగా, నిరుపయోగము, నశ్వరమైన ఈ దేహము కొరకు చింతించనేల? శారీరక రుగ్మతలు, అస్వస్థతలు ప్రతిజీవికి తప్పవు. పరలోకమునకు వెళ్ళుటకు ఆహ్వానమందిన వెంటనే సిద్ధపడక ఎట్లడ్డుకొనగలవు?



(50) సాయిదేవా ! నన్ను నీ దాసునిగా స్వీకరించినావు. నేను కడు దీనుడను, నిష్టదరిద్రుడను, పాపిని. అట్టి నాకు నీవాలంబనమైనావు. నిన్ను కీర్తించుటకు, నీవొనరించిన ఉపకారములను వర్ణించుటకు నేనెంతటివాడను. నా స్వరము గద్గదమగుచున్నది. నీ నామజపము చేత పాపములు పటాపంచలగుచున్నవి. నా ఉద్ధరణము కూడా జరిగినది.

(51) పరోపకారులైన దైవములు భక్తుల కామితములను నిత్యము తీర్చుచుందురు. ఈ సాయి భగవానుడు కూడ తన భక్తుల యెడల అపారప్రేమానురాగములు కలిగివారి కోర్కెలను అంతరంగమందే గ్రహించి, తీర్చగల సమర్థుడు. భక్తుడు ఎట్లు, ఎంతగా బాబాను భజించునో బాబా కూడా అట్లే, అంతగా స్పందించి, అభీష్టసిద్ధి కావించును.

(52) నా మనస్సు నందు దురాలోచనములు మొలకెత్తగనే నా శరీరము కంపించుచున్నది. పరధనము, పరస్త్రీ మొదలగునవి సన్మార్గగమనమున అడ్డంకులు. వాటినుండి నా దృష్టిని మరలించుము తండ్రీ ! బృందావనము నందలి ఫలములు అన్నియు తీయగా నుండునని మానవులభావన – అది సరికాదు. నిప్పు తాకినంతనే చుర్రని కాలును. కనుక ప్రభూ! **మంచి చెడుల విచక్షణాజ్ఞానము నాకు కలిగించి, నేను కష్టించినంతవరకే నాకా ఫలము దక్కునట్లు నిరంతరమనుగ్రహించుచుండుము.**

(53) ఈ కలియుగము అధర్మాచరణమునందు ఆరితేరినది దానివలన జీవులకు దుఃఖములు ఎక్కువైనవి. అది బడబానలము వలె వ్యాపించి,

మానవులకు నిలువనీడ లేకుండా చేయుచున్నది. ఈ స్థితిలో వివశుడనై, గత్యంతరము లేక నీకు నేను విన్నవించుకొనుచున్నాను. నీవే తల్లివి, తండ్రివి. "అన్యథాశరణం నాస్తి, త్వమేవ శరణం మమ" అని ప్రార్థించుట తప్ప ఈ అజ్ఞాని ఏమి చేయగలడు? నీవు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కొరకై అవతరించిన అవతారమూర్తివి కదా !

(54) ప్రభునామము ఎంతో మధురము. ఓ మనసా ! సాంసారిక జీవనలంపటమున తగులుకొనుట వృధా, పారమార్థిక చింతనకల జీవులు ధన్యులు. మాతాపితరులసేవ చేయుము. చేజిక్కిన ఈ అమృతఘడియలను వృధాచేయకుము. మోహము, లోభము నీ జీవితము నాశనమొనర్చునని తెలియుము. ఇలా పలికినానని ఈ దాసురాలిపై కోపపడక ప్రభునామము కీర్తించుము.

(55) మనసారాచేసిన మానవసేవయే మాధవసేవ అగును. దొంగ భక్తి, పదిమందిలో గుర్తింపు కావలెనను తత్త్వము శోభించవు. పూర్వజన్మసుకృతము లేకుండా ఏది సిద్ధించదని మనకు తెలియును. ప్రభూ! నాకసలైన, సిసలైన గురుభక్తి కలుగునట్లు వరప్రసాదము ఇచ్చువరకు నీ పాదపద్మములను వదలను.

(56) ఓ ప్రభూ! స్థిరచిత్తము లేని నేను నీ శక్తిని ఎట్లు కనుగొనగలను? నీవు దూరముగా ఉంటివో, దగ్గఱగా ఉంటివోగాని నాకుమాత్రం అన్ని జీవులలో ఉన్నట్లు అనిపిస్తుంది. మట్టినుండి పుట్టిన ఈ జీవుడు చివరకు మట్టిలోనే ముక్తిపొందుతాడు, "జీవుని రాకపోకలు ప్రారబ్ధము ననుసరించియే గదా



జరిగేది?" అని గొప్పవారు చెబుతారు. నా మాటలు కావివి. "జీవుడు, శివుడు ఒక్కటేనా? లేక వేరువేరా? ఇట్టి విషయములు మూర్ఖుడనైన నాకెట్లు తెలియును? ప్రభువే సృష్టి, స్థితి, లయలకు మూలమని సత్పురుషులు చెప్పినారు గదా? దేవా! నన్ను నా మానసిక ద్వైతభావము నుండి రక్షించెదవని నీ కొఱకు ప్రతీక్షించుచున్నాను.

(57) దేవా ! నా ప్రాణము నీ దర్శనము కొరకు తహతహ లాడుచున్నది. నీ స్వరూపమెట్టిదో ఎరుగను. నీకు సాటి మరొకరు లేరని చెప్పగా వింటిని. భక్తులను ఆదుకొనుటలో గజేంద్రుని కాచిన శ్రీహరివలె ఉందువందురు. నాకు నీ దర్శనభాగ్యము కలిగించి, మంచిమిత్రునివలె నన్నాదరించుము. నా అంతరంగము దొంగబుద్ధితోను, దేహము వికారములకు లోనై మసలుచున్నవి. నేను నీ బిడ్డను. నీ దర్శనభాగ్యమను భిక్షకొరకు నీవాకిట వద్ద నిలచిన భిక్షువును. దానిని ప్రసాదింపవా?

(58) నాలోని సోమరియను భిక్షకుడు అసలైన శత్రువు. ఏ పనియు చేయక ఏండ్ల తరబడి ఇంటివద్ద నిరుపయోగముగా ఉన్నవాడను. మనస్సు సంకల్ప, వికల్పములకు లోనై ఇబ్బంది పెట్టుచున్నది. నేటి శ్రేష్ఠమైన కార్యమును రేపటికి వాయిదా వేయకుండునట్లు నన్ను అనుగ్రహించుము. దేవా ! నీ నామమును ప్రేమతో జపించెదను. కాలమే ఈశ్వరరూపము. అదియే జీవులకు కాలచక్రము, సుఖప్రదాత. దాని ఆధీనమునందే జీవుని జననమరణములు, పతనోత్థానములు ఇమిడియున్నవి. ఓ కాలచక్రమా ! నీకిదే నా నమస్కారము.

(సశేషం)

# బాబా నిత్యసత్యుడు నాటిలీలలు - నేటి లీలలు

**యం.విద్యాసాగర రావు,** రిటైర్డ్ టీచర్, సద్గురు శ్రీ షిరిడీ సాయి మందిరం, పొన్నూరు, శ్రీఆంజనేయస్వామివారి గుడి దగ్గర, గుంటూరు జిల్లా.



శ్రీసాయి రెండవసారి షిరిడీ వచ్చిన తదుపరి ద్వారకామాయిలో స్థిరనివాసమేర్పరుచుకొనిరి. అప్పటికే బాబా తాను పంచభూతముల శాసనకర్తగాను, సర్వజ్ఞుడు, సర్వాంతర్యామిగాను చాంద్‌పాటిలుకు చూపిన లీలల ద్వారా ప్రకటన చేసియున్నారు. తదుపరి 1886 వరకు ఎట్టి లీలలు చూపలేదు. 1886లో శరీరము నుండి ఆత్మను వేరు చేసి సమాధి యందుంచిన లీలను చూపిన తరువాత భక్తులు ఎక్కువగా రాసాగిరి. కొందరి భక్తులకు సశరీరముగా దర్శనమిచ్చి ఏ విధంగా బాధలనుండి రక్షించిరో తెలుసుకొందాం.

ఒకసారి నానా సాహెబ్ చందోర్కర్ హరిశ్చంద్రగుట్టపైకి కొంత దూరము వెళ్ళిరి. ఎండ ఎక్కువగా యుండెను. నానా చందోర్కర్ దప్పిక కొనెను. అచట ఎక్కడా నీరు కనిపించలేదు. నానా దప్పికతో నీటికొరకు అలమటించుచుండెను. అచట ఒక భిల్లుడు ప్రత్యక్షమయ్యెను. అతను నానాతో యిట్లనెను. "నీవు కూర్చున్న బండ క్రిందనే మంచినీరున్న"దని చెప్పి ఆ బండను



ఎత్తగా దానిక్రింద నీరుండెను. నానా ఆ నీరు త్రాగి దప్పిక తీర్చుకొనెను. యింతలో ఆ భిల్లుడు అదృశ్యమాయ్యెను. ఆ సమయంలో బాబా మశీదులో "నానా దప్పికలో యున్నాడు. అతనికి నీరిచ్చి రక్షింతు"ననెను. ఆ మాటలు విన్న అచట భక్తులకు అర్థము కాలేదు. తరువాత కొన్ని రోజులకు నానా శిరిడీకి వచ్చి బాబాను దర్శించెను. బాబా "నీరు దొరికెనా?" అని ప్రశ్నింప అతడాశ్చర్యపడెను. అప్పుడు నానా భిల్లునిరూపంలో వచ్చి దప్పిక తీర్చి కాపాడినది బాబాయే అని తలచెను. శ్రీసాయి తన భక్తులను సకాలములో వచ్చి రక్షించెనని మనకు ఈ లీలవలన తెలియుచున్నది.

బాబా దేహానంతరము జరిగిన మరియొక లీలను తెలుసుకుందాము. 1942లో శ్రీసాయిబాబా పుణ్యతిథి ఉత్సవములో పాల్గొనుటకు శ్రీవెంకటేశ్వర్లుగారు షిరిడీ ప్రయాణమై బొంబాయి మెయిలులో బయలుదేరి "ధోండ్" స్టేషన్‌లో దిగినారు. అచ్చట శ్రీవెంకటేశ్వర్లుగారికి బహిర్భూమికి వెళ్ళవలసిన అవసరమేర్పడినది. ఎటూ వెళ్ళుటకు తోచలేదు. అచట వీరి భాష వారికి అర్థము కాదు. ఏమి చేయవలెనో తోచలేదు. ఇలా మధ్య నడుచుచుండగా షుమారు 40 సం॥ల వయస్సు గలిగిన కొల్లాయి గుడ్డ కట్టుకొని అలాంటిదే మరొకటి పైన వేసుకొని వెంకటేశ్వరరావుగారి దగ్గరకొచ్చెను. వీరి మనసులో బాధను తెలిసినవానివలె తెలుగులో మాట్లాడుచు, నీటిలో నున్న చెంబును రావుగారికి యిచ్చి బహిర్‌భూమికి వెళ్ళవలసిన ప్రదేశము చూపెను. ఆ వచ్చిన వ్యక్తి రావుగారి సంచివద్ద కాపాల యుండెను.

వెంకటేశ్వర్లుగారు వారి అవసరము తీర్చుకొని అతనువద్దకు వచ్చినాడు.

అప్పుడు ఆ వచ్చిన వ్యక్తి రావుగారితో “పైన భోజనం పెడతానంటారు. నీవు అది తినకు హాలులోపల స్టాలువాడు రొట్టె యిస్తాడు. కావలసిన వరకు తిను” అని చెప్పి వెళ్ళిపోయాడు. అప్పుడు వెంకటేశ్వర్లుగారికి ఇతనెవ్వరు? నా మనస్సు లోని బాధ యితనికెట్లు తెలిసినది ? అని ఆలోచనరాగానే శ్రీసాయి అయివుంటారని ఆ వ్యక్తి పోయిన దిక్కు చూడగా ఆ ప్లాటుఫారంపై అతను ఎక్కడా కనిపించలేదు. ఇంత నిదర్శనంగా వచ్చి నన్నాదుకున్న బాబాను గుర్తించలేకపోయానేయని వెంకటేశ్వర్లుగారు బాధపడినారు. తన దురదృష్టమునకు చింతించినారు.

వీరికే కాదు ఎవరికైనా బాబా అనుగ్రహమునకు పాత్రుడైనవారికి బాబా యిప్పుడును సశరీర దర్శనమిచ్చుట జరుగుచునేయున్నది. వారు అలా తన భక్తులకు దర్శనమిచ్చి వెళ్ళిన తరువాత గాని ఆ వచ్చినది బాబాయే యని గుర్తుకువచ్చుట లేదు. బాబా సశరీరముగా దర్శనమిచ్చి లీలన్నింటిలోను యిలా జరుగుట బాబా మనోగతమై యుండవచ్చు. బాబా తనను నమ్ముకొనియున్న అంకిత భక్తులను వివిధరూపములలో దర్శనమిచ్చి బాధలనుండి విముక్తి చేయుదురని పై లీలల వలన తెలియుచున్నది. శ్రీవేమూరి వెంకటేశ్వర్లుగారికి బాబా చాలా లీలలు చూపి వారిని బాధలనుండి కాపాడిరి.

మనము కూడా బాబా అనుగ్రహమునకు పాత్రులమై సశరీర దర్శనము పొందవలెను. శ్రీసాయికి అంకితభక్తులమై సాయి తత్వము అవగాహన చేసుకొని మన జీవితములను తీర్చిదిద్దుకొనవలెను.






# పిలిచిన పిలుపే విశ్వవిఖ్యాతి గాంచిన వేళ !

## మహాభక్త భగత్ మహల్సాపతి జీవిత చరిత్ర

**సాయిదాసానుదాసు సురేంద్రబాబు,** కొవ్వూరు, నెల్లూరు జిల్లా




(గత సంచిక తరువాయి భాగం)

ఇలా బాబా త్రికాలజ్ఞతకు సంబంధించిన సంఘటనలు మహల్సాపతి ఎన్నో అనుభవమయ్యాయి. 1890-91 ప్రాంతంలో మహల్సాపతి, అప్పాజోగ్లే, కాశీరాం మొదలైన భక్తుల సమక్షంలో శిరిడీ భవిషత్తు గురించి బాబా క్రింది విధంగా పలికారు. “ఇచ్చట ఎన్నో అంతస్థులు గల పెద్ద పెద్ద భవనాలు లేస్తాయి. ఎన్నో సంతలు, సంబరాలు జరుగుతాయి. సుబేదారు, పెద్దలు వస్తారు. నా బ్రాహ్మణులు ఇక్కడ గుమ్మికూడుతారు. ఏనుగులు, గుర్రాలు, రథాలు విరివిగా తిరుగుతాయి. శకంర్ నానాకూడా వస్తారు. తుపాకులు పేల్చబడతాయి!!” అన్నారు. దీని భావం ఇక్కడ అంటే శిరిడీలో ఎన్నో అంతస్థులు గల పెద్ద పెద్ద భవనాలు నిర్మింపబడతాయి. సంతలు, సంబరాలు జరుగుతాయి. పెద్దవాళ్లు, గొప్ప గొప్ప అధికారులు వస్తారు. నా భక్తులు ఇక్కడ గుమ్మికూడి ఉత్సవాలు, వేడుకలు జరిపిస్తారు. పవిత్రులు, పండితులు, సాధువులు కూడా వస్తారు. బస్సులు,

కార్లు, ఇతర ప్రయాణ సాధనాలు విరివిగా తిరుగుతాయి. శిరిడీ ఖ్యాతి నలుమూలలకు వ్యాప్తిచెంది, ప్రపంచమంతా మార్మోగుతుంది. అప్పుడు శిరిడీ ఒక కుగ్రామం. చుట్టు అడవులు, పొలాలమధ్య, నూరు నూటయాభై గడపలతో రోడ్లు, ప్రయాణ సాధనాలు లేని వెనుకబడిన ప్రాంతం. బాబా మాటలు విని భక్తులు నవ్వుకున్నారు. ఈ పిచ్చి ఫకీరుదో పగటి కలలు కంటున్నాడని అనుకున్నారు. అప్పుడు బాబా త్రికాలజ్ఞతను గూర్చి తెలియని భక్తులు అలా అనుకోవడం సహజమే ! కానీ బాబా మాటలు అక్షరసత్యాలని, ఈనాడు శిరిడీ చూచినవారు అనుకోకతప్పదు. ఈనాటి శిరిడీ దృశ్యం వారు 115 సంవత్సరాల క్రితమే కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

మహల్సాపతి భవిష్యత్తును గూర్చి బాబా క్షుణ్ణంగా తెలుసు. అప్పుడప్పుడు వారా మాటలద్వారా సూచించారు కూడా ! కానీ మహల్సాపతి తెలుసుకోలేక పోయడు. బాబా ఎలా సూచించారో క్రింది సంఘటనలవలన మనకు తెలుస్తుంది. బాబా అనుగ్రహంతో 1897లో మహల్సాపతికి మగపిల్లవాడు జన్మించినట్లు ముందు వ్రాయడం జరిగింది కదా ? ఒక రోజు మహల్సాపతి ఆ పిల్లవాడిని తీసుకొని మశీదుకు వెళ్ళాడు. పిల్లవాడికి నామకరణం చెయ్యమని బాబాను అర్థించాడు. బాబా ఆ విషయమేమీ పట్టించుకోలేదు. పైగా బిడ్డపై మమకారం పెంచుకోవద్దని సూచిస్తూ, “బిడ్డను 25 సంవత్సరాలు చూచుకో! చాలు !” అన్నారు. మహల్సాపతి బాబా మాటలు, వారి ఉద్దేశ్యము అర్థంకాలేదు. బిడ్డకు తనే మార్తాండ్ అని పేరు పెట్టి పెంచసాగాడు. కానీ మార్తాండ్‌కు 25 సం॥ వయస్సు ఉన్నప్పుడు మహల్సాపతి నిర్యాణం చెందాడు.“25 సం॥ చూచుకో చాలు” అని బాబా చెప్పిన మాటలలోని అంతరార్థం అది. (ఇంకా ఉంది) ☐





# సాయినాథ ఉవాచ

సేకరణ - వ్యాఖ్యాత సాయిదాసానుదాసు
**సురేంద్రబాబు,** కోవూరు, నెల్లూరుజిల్లా

***(శ్రీసాయివాక్కులు బ్రహ్మవాక్కులు! శ్రీసాయి షిరిడీలో సశరీరులుగా మెలిగిన 60 సం॥రాలలో వారి వాచ అసంఖ్యాకమైన వాక్కులు వెలువడ్డాయి. వాటిలో ఆణిముత్యాల్లాంటి కొన్నింటిని ఏర్చి, సందర్భోచిత వ్యాఖ్యాన సహితంగా దిగువ ఇవ్వడం జరిగింది, అవధరించండి)***

***(గత సంచిక తరువాయి భాగము)***

***(290) “బ్రతుకవలసినవాడు, ఎంతటి విపత్కరపరిస్థితులలో ఉన్నా బ్రతుకుతాడు. చావవలసినవాడు, ఎంతటి క్షేమకర పరిస్థితులలో ఉన్నా చస్తాడు. ఇది అల్లా నిర్ణయం.”***

***(291) “నీవు శిరిడీలో ఉంటే చనిపోతావని, శిరిడీ విడిచి వెళ్తే బ్రతుకుతామని అనుకొంటూన్నవు. నీ నిర్ణయం తప్పు !”***



శిరిడీలో ఒక హల్వా అంగడి ఉండేది. ఆ అంగడతను ప్రతిదినం బాబాకు నైవేద్యంగా కొంత హల్వా పంపేవాడు. శిరిడీలో ప్లేగు వ్యాధి ప్రబలి ఉన్న రోజులవి. ఎందుకో ఒకరోజు హల్వా పంపబడలేదు. ఇలా ఎందుకు జరిగిందో సర్వజ్ఞుడైన బాబాకు తెలుసు. కానీ, భక్తులకు కొన్ని విషయాలు, ప్రబోధించాలనే సంకల్పంతో, అక్కడ ఉన్న నార్కేను పిలిచి,

హల్వా అంగడికి వెళ్ళి, హల్వా తెమ్మని పంపారు. నార్కే వెళ్ళేప్పటికి హల్వా అంగడతని శవం వాకిట్లో ఉంది. అతను ప్లేగుతో చనిపోయాడు. అతని భార్య శవం ముందు కూర్చుని, అతి దీనంగా ఏడుస్తూ ఉంది. నార్కే సంకోచిస్తునే, అల్మారా తెరచి, హల్వా తీసుకొని, మశీదుకు బయలుదేరాడు. మశీదుకు నడుస్తూ తను ప్లేగుప్రబలి ఉన్న శిరిడీ విడిచి వెళ్తే క్షేమకరమని తలచాడు. ప్లేగు సోకి ఉన్న అంగడినుండి తెచ్చిన హల్వా ప్రసాదంగా పంచడంవల్ల ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని కూడా సందేహించాడు. నార్కే మశీదుచేరి, హల్వాను బాబాకు యిచ్చాడు. బాబా అతని ఆలోచనలను పసిగట్టి, "నీవు శిరిడీలోనే ఉంటే చనిపోతావని, శిరిడీ విడిచివెళ్తే బ్రతకుతావని అనుకుంటున్నావు. నీ ఆలోచన తప్పు. **బ్రతుకువలసినవారు ఎంతటి విపత్కర పరిస్థితులలో ఉన్నా బ్రతుకుతారు. చావవలసినవారు ఎంతటి క్షేమకర పరిస్థితులలో ఉన్నా చస్తారు. ఇది అల్లా నిర్ణయం అన్నారు.** బబా నార్కే తెచ్చిన హల్వాను ప్రసాదంగా భక్తుందరికి పంచారు. ఎవరికీ ప్లేగు పాకలేదు. నార్కే తన ఆలోచనలకు సిగ్గుపడ్డాడు.

### *(292) "నీతి, నిజాయితీలతో యోగ్యంగా గడుపు, విషయాభిలాష లేకుండ పవిత్రంగా ఉండు !"*

శ్రీగల్వంకర్ హేమాడ్పంతు అల్లుడు. ఇతడు సాయిబాబా సంస్థాన్ మెంబరుగా చాలాకాలం పనిచేశాడు. ఇతడు బొంబాయి సెక్రటరియట్‌లో సూపరిన్‌టెన్‌డెంటుగా పనిచేసేవాడు. ఇతనికి ఒకసారి బాబా కలలో కన్పించి **"నీతి నిజాయితీలతో యోగ్యంగా గడుపు. విషయాభిలాష లేకుండ పవిత్రంగా గడుపు"** అని ఆదేశించారు. గల్వంకర్ బాబా ఆదేశాన్ని తు.చ. తప్పకుండ ఆచరించాడు. దీనిని బట్టి నీతిని నిజాయితీలతో అందరూ గడపాలని బాబా హితవు !

### *(293) "బారవి బావి దగ్గర ఇరుకు సందులోనికి రాగలదేమో విచారించిరా!"*

కళ్యాణ్ నివాసి హాజీసిద్ధిక్ ఫాల్కే అను మహమ్మదీయుడు ఉన్నప్పటికి బాబా ఇతనిని మశీదులోనికి, అనుమతించలేదు. శ్యామా ఇతని నిరీక్షణ చూచి జాలిపడి అతనిని మశీదులోనికి అనుమతించమని ప్రార్థించాడు. బాబా కరుణించాడు. కానీ ముందు ఆ భక్తుని పరీక్షించదలచి, మూడు ప్రశ్నలకు జవాబులు రాబట్టారు. మొదటిది, బారవీ బావి వద్ద నున్న ఇరుకు సందులోనికి రాగలదేమో విచారించి రమ్మన్నారు. శ్యామా బాబా చెప్పినట్లుగా హాజీ దగ్గరకి వెళ్లి, మూడు ప్రశ్నలకు జవాబులు తెలిసికొనివచ్చి బాబాకు నివేదించాడు. ఆధ్యాత్మికపరిభాషలో మొదటి ప్రశ్న యొక్క భావం, లౌకిక సుఖాలను త్యజించి, క్లిష్టమైన ఆధ్యాత్మికమార్గంలోకి రాగలదేమో విచారించడం. దీనికి ఫాల్కే తప్పక వస్తానని జవాబిచ్చాడు.

### *(294) "నలభైవేల రూపాయలు, నాలుగు వాయిదాలలో చెల్లించగలదేమో, విచారించి రా !"*

ఇది బాబా అడిగిన రెండవ ప్రశ్న. దీనికి ఆధ్యాత్మిక పరిభాషలో నాలుగు అంతఃకరణాలైన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారాలను సమర్పించగలదేమో విచారించి రమ్మనడం. హాజీ సమర్పిస్తానని చెప్పాడు.

***(295) "మశీదులో మేకను కోస్తున్నారు. అతనికి మేక మాంసం కావలెనా, పిరుదు మాసం కావలెనా లేక వృషణాలు కావలెనా, విచారించి రా !"***

ఇది బాబా అడిగిన చివరిప్రశ్న. మాంసము, పిరుదులు, వృషణాలు, ధర్మ, అర్థ, కామాలకు సంకేతం. అంటే మూడు పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామాలను జయించగలడో లేదో విచారించి, రమ్మనడం. దీనికి హాజీ "బాబా తినే మట్టిపాత్రలో మిగిలిన ముక్కతో సంతృప్తి పడగల"నని చెప్పాడు. బాబా పాత్రలో ముక్కంటే, గురు ఉచ్ఛిష్టం తినడమన్నమాట ! అంటే నాల్గవ పురుషార్థమైన మోక్షాభిలాష కలిగి ఉండటమన్నమాట ! ఇలా బాబా పెట్టిన పరీక్షలో ఫాల్కే ఉత్తీర్ణుడయ్యాడు. బాబా సంతృప్తిచెంది, అతనికి బుట్టెడు పండ్లు, డబ్బు పంపి, మశీదులోనికి ఆహ్వానించారు.

***(296) "ఈ దేహమున్నంతవరకు సంసారం, ప్రారబ్ధం, దాని నంటిపెట్టుకొని ఉంటుంది. దాని నెవ్వరూ తప్పించుకోలేరు. నేను సైతం దాని నుండి తప్పించుకోలేదు."***

ఒకసారి నానాసాహెబ్ చందోర్కర్ బాబా దగ్గరకొచ్చి, తనను సంసార బంధాలనుండి తప్పించి విముక్తి ప్రసాదించమని ప్రార్థించాడు. అప్పుడు బాబా దేహమున్నంతవరకు దాని నంటిపెట్టుకొని ఉన్న సంసారాన్ని, ప్రారబ్దాన్ని, ఎవరూ తప్పించుకోలేరని, తాము సైతం దానినుండి తప్పించుకోలేదని చెప్పి, అతనిని ఊరడించారు.



(ఇంకా ఉంది)



# అధ్యాత్మిక దర్శన్

- మంత్ర జపాలు చేసినా, హోమాలు నిర్వహించినా, యజ్ఞయాగాదులు చేసినా, గొప్ప గొప్ప శాస్త్రాలు చదివినా బుద్ధి కుదురుగా లేకపోతే, పరివర్తన సరిగా లేకపోతే మోక్షము కలుగదు.
- ఫలితం ఆశించకుండా పనిచేస్తేనే పరమాత్మకు సంతోషం.
- ప్రతిఫలం ఆశించకుండా సేవచెయ్యి. దేవుని నామాన్ని స్మరించు. సద్గ్రంథాలు చదువు. వాదులాటలు, కీచులాటలు మాను. ఆ భగవంతుడు సదా కాపాడుతాడు.
- సమస్యలు లేని జీవితం లేదు. ఒక దాని తరువాత ఒకటి వచ్చి పడుతుంటాయి. భగవంతునిపై భారంవేసి వాటిని ఎదురుకోవాలి.
- భక్తి విశ్వాసం ఉండాలే కానీ మనం చేసే ప్రతి ప్రార్థన ఫలాన్నిస్తుంది.
- బంధాలనుండి బయటపడేందుకు యత్నించేవారే ఆధ్యాత్మికజీవితానికి అర్హులు.
- ఆత్మజ్ఞానం పొందాలంటే ఆత్మసాక్షాత్కారం పొందిన గురువు సహాయం అవసరం.
- గత జన్మలో చేసుకున్న పాప, పుణ్యాలను బట్టే యోగీశ్వరుల సాంగత్యాన్ని పొందగలం. వారి సాంగత్యంతో అప్పటివరకు పేరుకుపోయిన మన పాపాలు తొలగిపోవు.
- యోగేశ్వరులు వేర్వేరు ప్రాంతాల్లో అవతరించి భగవంతుడు తమ కప్పగించిన పనులను నెరవేరుస్తూంటారు.
- మనఃపూర్వకముగా, హృదయపూర్వకంగా పూజించేవారిని భగవంతుడు కంటికి రెప్పలా కాపాడతాడు.
- సత్ప్రవర్తనకు మంచి స్వభావానికి కారణభూతుమైన మనసును ఎవరైతే అదుపులో ఉంచుకోగలుగుతారో వారే వ్యక్తిత్వసంపన్నులు అవుతారు.
- మనసులో మంచిని తలుచు, కళ్ళతో మంచిని చూడు. నాలుకతో మంచిని మాట్లాడు. చెవులతో మంచిని విను. నీ మనస్సు నిర్మలముకానీయి.

# అమృతవాక్కులు

సేకరణ : **కె. ఆర్. విజయ్‌కుమార్,** మదనపల్లి – 517 325



దైవభక్తి పరాయణులైన మహాత్ములు కల్పవృక్షంవంటివారు. వీరి నీడలో అన్ని కోరికలు నెరవేరుతాయి. వారు చింతామణి వంటివారు. అందరి చింతలను తీరుస్తారు. వారి మాటలు అమృత సముద్రాలు. వారు మానవ హృదయాల లోని చైతన్యాన్ని మేల్కొపుతారు.

– జ్ఞానదేవుడు

ఎవరు దైవగుణాలైన కరుణ, క్షమ, నిస్వార్ధసేవ, అహింస మున్నగువాటిని కలిగియుంటారో వారి ప్రక్కన శ్రీసాయినాథులు సదా వుంటారు.

– శ్రీసాయిసచ్చరిత్ర

వృక్షాలు సత్పురుషుల వంటివి. అవి ఎండలో మాడుతున్నా తమను చేరినవారికి నీడను, ఫలాలను ప్రసాదిస్తాయి – నిత్యనీతి.

ఎల్లప్పుడు నిస్సహాయులకు సహాయం చేయాలి. అంతేగాని భాగ్యవంతులకు కాదు. జబ్బుతో వున్నవారికి వైద్యం కావాలిగాని ఆరోగ్యవంతులకి కాదు కదా !

– సూక్తిమాల

దుర్నీతిపై కోపాన్ని, హరినామజపానికి పేరాశను, ముక్తికై మోహాన్ని చెడ్డపనులపై ద్వేషాన్ని కలిగివుండు – శ్రీ షిరిడీ సాయిబాబా



# శ్రీసాయిబాబా జన్మరహస్యం

**సాయిదాసానుదాసు సురేంద్రబాబు,** కొవ్వూరు, నెల్లూరు జిల్లా


(గతసంచిక తరువాయి భాగం)

**ఇతర చరిత్రకారులు రూపకల్పన చేసిన కథలు**

## తీవ్రవాద భక్తుల కథనం



సాయిబాబా ఒక నడయాడే విజ్ఞానస్వరూపం! వివిధ మత సంస్కృతులు, సాంప్రదాయాలు వారికి క్షుణ్ణంగా తెలుసు. వివిధ మతగ్రంధాలసారం కూడా తెలుసు. బైబిల్, ఖురాను, భగవద్గీత మొదలైన గ్రంథాలన్నీ తెలుసు. ఈ గ్రంథాలను ముందు నుండి వెనుకకూ, వెనుకనుండి ముందుకు వల్లించగల సమర్థులు. ప్రపంచంలో మాట్లాడే భాషలన్నీవారికి తెలుసు. ఇవన్నీ వారు ఎలా నేర్చుకున్నారు? గురువు దగ్గరే నేర్చుకున్నారా? నేర్చుకొని ఉంటే చదవటం, వ్రాయడం పద్ధతులు అప్పుడు యిప్పటిలా లేవు కాబట్టి, శృతి, స్మృతి (Ricitation Memory) పద్ధతులద్వారా నేర్చుకొని ఉండాలి. ఒకే గురువు వద్ద విభిన్నమతాల సారం నేర్చుకోవడం సాధ్యమేనా? వారికి లభించిన మహాసిద్ధులు కూడా గురువు నుండి సంక్రమించినవేనా? అసలు యివన్నీ సాధ్యమేనా? ఇలాంటి ప్రశ్నలు, సందేహాలు, బాబా చరిత్ర చదివినవారికెవరికైనా రావడం సహజమే!



కానీ వీటన్నింటిని జవాబులు చెప్పడం దుస్సాధ్యం. బాబాను "స్వయంభువు"గా పేర్కొన్నారు. వారు స్వయంసిద్ధులని, స్వయం వ్యక్తులని, వారికి గురువు యొక్క ఆవశ్యకత లేదని, గురువును కేవలం ఒక సంకేతపరంగా (As a symbol) భక్తుల కొఱకు పేర్కొన్నారని భావిస్తారు. శ్రీసాయిశరణానందస్వామి కూడా చివరకు సాయిబాబాను "స్వయంభువు"గా పేర్కొని, తమ వాదాన్ని కొన్ని ఉదాహరణలద్వారా సమర్థించారు. హేమాడ్‌పంతుకూడా "శ్రీసాయి సచ్చరిత్ర"లో బాబాను, అయోనిజసంభవునిగానూ, స్వయంభువుగానూ పేర్కొన్నారు. నామదేవ్ భీమరతీ నదిలో గోసాయిబాయికి, కబీరు భాగీరథీనదిలో తామల్‌కు ఎలా దొరికారో, అలాగే సాయిబాబాకూడా శిరిడీలోని వేపచెట్టు క్రింద 18 సం11ల బాలునిగా ఉద్భవించారని వ్రాశారు.

**ఉపసంహారము :**

బాబాకు గురువొకరున్నారనేది మాత్రం తథ్యం, వారి పేరు రోషన్‌షా కావచ్చు, వెంకూసా కావచ్చు, మరెవరైనా కావచ్చు. కానీ వారొక గొప్ప సూఫీ మహాత్ములై ఉంటారని పలువురి అభిప్రాయం.

జై సాయినాథ్ ! జై జై సాయినాథ్ !!






# గురుపౌర్ణమి

-చిరువోలు విజయనరసింహారావు, శంభునగర్, రాజమండ్రి

శ్రీగురున్మది గొల్చి సచ్ఛీలురగుచు
నిరత భక్తితత్పరత పునీతులగుట
మోక్ష పథమంది, లభియించు ముక్తిపదము
గురువు భువి త్రిమూర్తుల రూపమరయదగును. 1.
లోకగురువైన కృష్ణుడు శ్రీకరుండు
ఆది గురువైన శంకరు డాదరించు
దక్షిణామూర్తి భవరోగతారకుడు
దత్తగురుదేవు డార్తుల దయను బ్రోచు
సాయినాథుడు భక్తుల శరణమిడును. 2.
గురుని సేవింప విజ్ఞానభరిత విద్య
లెల్ల నిలప్రసాదించు తా నిచ్చ మెచ్చి
సకళ శాస్త్రంబులబ్బు నాసాంతముగను
ఇతర శ్రమలేల ? గురుడిచ్చు హితము మనకు. 3.
గురుపరంపరా విధమద్ది తేరువుఁజూపు
భారతీయ సంస్కృతియై ప్రభావమిడును
గురునిశక్తి దైవవరమై కోర్కెఁదీర్చి
సకల శుభములొసంగును శక్తిఁ గూర్చి. 4.
వ్యాస పూర్ణిమ యననొప్పు భవ్యగురుని
పూజ సల్పెడు దినము, సంపూర్ణకామ
దంబు, శుభదంబు, సుఖదాయి ధన్యమొనరఁ
జేసి, తరణమార్గము జూపు, చింతలడచి
సద్గురుని చరణంబులే శరణమనుడు. 5. ❑

# శ్రీలలితా సహస్రనామములు (అర్ధసహితము)

(గతసంచిక తరువాయి భాగం)- ***యల్లమిల్లిసరోజినిజోగారావు.*** హైదరాబాద్



**139.“ఓం నిర్గుణాయై నమః” :** సకల గుణాతీతమైన నిర్గుణ గుణాతీతురాలు. సృష్టిలోని సకల రూప, నామ, గుణముల కతీతమైన నిర్గుణరూపిణికి నమస్కారము. సత్వ,రజో, తమో తురీయగుణతత్త్వములను, దాటి తురీయాతీతమైన కైవల్యపదము చేరుటకు జగదీశ్వరికి సర్వసమర్పణ గావించి శరణాగతి నొంది సర్వజ్ఞాన మయి, పద సరోజములపై శిరమును వుంచి వేడుకోవాలి.

**140.“ఓం నిష్కలాయై నమః” :** వృద్ధక్షయములు లేని, పరిపూర్ణకళలతో వెలుగు చిత్స్వరూపిణి–సాధకులకు, అనుభూతులు, అనుభవాలు కలిగించును. చిత్కళారహితస్థితికి చేరినవారికి, ఆత్మస్వరూపిణి దర్శన మొసగును. శ్రీనిష్కలకు నమస్కారము.

**141.“ఓం శాంతాయై నమః” :** శాంతస్వభావం గల శాంతిస్వరూపిణి, సకలజనులకు, శాంతమే ప్రధానమని బోధించి, తరింపజేయును. సత్వగుణ ప్రధానమైన శాంత గుణము తానై సాత్వికులందు ప్రకాశించును.



**142.“ఓం నిష్కామాయై నమః” :** ప్రతిఫలము ఆశించక చేయు కర్మలను నిష్కామకర్మ అంటారు. నిస్వార్థులైనవారిచే, నిష్కామకర్మ చేయించి వారికి సంతృప్తి, పుణ్యము చేకూర్చి వారికోరికలను తీర్చు శ్రీజగన్మాత నిష్కామకు నమస్కారము.

**143.“ఓం నిరుపప్లవాయై నమః” :** అమృతానందమయి, తన భక్తులకు, సాధకులకు, భక్తి, సాధనామార్గములకు నిరోధము ఏర్పడకుండ కాపాడును.

**144.“ఓం నిత్యముక్తాయై నమః” :** నిత్యము అనన్యభక్తితో శ్రీమహానిత్యను, అంతర్యాగబహిర్యాగమున అర్చించు భక్తులకు నిత్యముక్తిని ప్రసాదించి జీవన్ముక్తుల జేయును.

**145.“ఓం నిర్వికారాయై నమః” :** వృద్ధిక్షయములు లేక నిర్వికారమైన తత్త్వమున నిత్యయై, నిఖిలమై, సత్యం, అనంతం బ్రహ్మ, సత్‌చిత్ ఆనందం,సత్యం శివం సుందరముగా భాసిల్లు శక్తిమయికి సాష్టాంగనమస్కారము.

**146.“ఓం నిష్ప్రపంచాయై నమః” :** ఆజ్ఞాకమలము క్రింద వున్న మధ్య కూటమి పంచభూతబంధప్రాపంచమయము. కూటత్రయముపైనున్న తురీయ కూటమిన, చిత్కళయై, మంగళప్రదమైన మహిమగలిగి ప్రపంచంతో సంబంధము లేకుండా ప్రతిభతో వెల్గుచూ, నిష్ప్రంచమైన విఖ్యాతీయురాలు శ్రీపరాశక్తికి నమస్కారము.


**147.“ఓం నిరాశ్రయాయై నమః” :** ఆశ్రయంబులకెల్ల తాను ఆశ్రయమైన జనని అఖిలలోకములు జగదంబికను ఆశ్రయించును. నిత్యశుద్ధురాలైన శ్రీమహాత్రిపురసుందరికి సాష్టాంగ నమస్కారము.

(సశేషం)

# బ్రహ్మ సాక్షాత్కారమునకు శ్రీగురు అనుగ్రహము

ప్రబోధకులు :సద్గురు శ్రీ సిద్ధానంద చైతన్యజీ మహారాజ్, రాజమండ్రి

మన శరీరమను రూపముయందు ఆధ్యాత్మిక కేంద్రములు ఉన్నవి. వాటిని షట్చక్రములు అందురు. ఏ సాధకుడు తన హృదయములో ప్రాణశక్తిని గుర్తించాడో, ఆ ప్రాణశక్తియే కుండలినీ శక్తి అని తెలుసుకున్నాడో అపుడు తన వెన్నుపూసలు ఉండే నాళమును సుషుమ్నా నాళము అని గుర్తించుతాడు.



ఈ కుండలినీ శక్తి ఈ సుషుమ్నా నాళము గుండా ప్రయాణము చేస్తుంది. తెలియని వాళ్ళు ఏమనుకుంటారంటే మూలాధారము నుండి ప్రయాణము మొదలవుతుంది అనుకుంటారు అది సరికాదు.

ఎప్పుడయితే హృదయంలో కుండలినీ శక్తి గుర్తించావో సుషుమ్నా నాళము తెరుచుకుంటుంది. దానికి క్రిందికి మార్గము ఉంది. పైకి మార్గము లేదు. ఈ కుండలినీ శక్తి యీ రెండు మార్గముల గుండా ప్రయాణిస్తుంది.



సాధకులలో క్షుద్రమయిన కోరికలు, క్షుద్రమయిన ఆలోచనలు, సిద్ధులం కావాలని, వాటిని ప్రదర్శించాలని వారి కోరికలు ననుసరించి ఆ శక్తి క్రిందకు ప్రయాణం చేస్తుంది. సాధకునికి ఉన్నతమయిన కోరికలు ఉన్నతమయిన ఆశయములు ఉనట్లైతే ఆ శక్తి ఊర్ధ్వముఖముగా ప్రయాణం చేస్తుంది. ఈ శక్తి ఊర్ధ్వముగా ఉన్నదని గుర్తించిన గురువు సాధకునకు సోహం హంసశివః లేక, సోహం హంస కేవలాత్మః అని సాధకునికి ఆత్మయోగ సాధన యిస్తాడు. ఆ ఆత్మయోగ సాధన వలన ఆత్మజ్ఞానము గ్రాహ్యమవుతుంది. ఆ శక్తి హృదయకోశము నుండి విశుద్ధ చక్రము చేరుకుంటుంది. ఆ విశుద్ధ చక్రములో హంస అనుభవము కలుగుతుంది. హంస పాలనుండి నీరును వేరుచేసి పాలనే స్వీకరించుతుంది. అదే విధముగా ఈ ప్రపంచానుభవములో తాను ఉన్నప్పటికీ కూడా ఏ పొరపొచ్చములు లేకుండగ ఎవ్వరికి ఏ కష్టము నష్టము కలుగకుండగ జీవించేటటువంటి సమర్థత నిస్తుంది.

ఈ హంస విశుద్ధ స్థానము నుండి ఆత్మ చక్రము వద్దకు ప్రయాణం చేస్తుంది. ఆజ్ఞా చక్రము అంటే జ్ఞానచక్రము. ఈ ప్రయాణములో అజ్ఞానమంతా తొలిగిపోయేటటువంటి ఒకే జ్ఞానస్థితిలో ప్రవేశిస్తాము. అప్పుడే సాధకులు వెలుతురు కనిపిస్తున్నది అంటారు. అదేమీ కాదు. అక్కడ వెలుతురు కాదు. జ్ఞానము గోచరిస్తుంది. ఇప్పటివరకు సాధకుడు ఏది జ్ఞానమని అనుకున్నాడో అదంతా అజ్ఞానము అని అనుభవము కలుగుతుంది.

సాధకుని యొక్క అనుభవములో జ్ఞానము వ్యక్తమవుతుంది. దేనికి సంబంధించిన జ్ఞానము? తన అనుభవమునకు సంబంధించిన ఆత్మజ్ఞానము వ్యక్తమవుతుంది. తాను ఇప్పటివరకు ఏది నిజమనుకున్నాడో, అది నిజము

కాకుండా పోతుంది. నిజమేదో తనకు స్వానుభవమవుతుంది. ఇక తన చుట్టూ ప్రపంచము ఉన్నది. తన సంసారము ఉన్నది. తన బాధ్యత ఉన్నది. ఈ బాధ్యతా నిర్వహణలో ఉన్నదానికి, తనకూ పొత్తేమీ కుదరదు. పొత్తు కుదరడం అంటే తన అనుభవం తీరు వేరుగా ఉంది. ప్రపంచం తీరు అనుభవం వేరైపోతుంది. ఇక్కడ రెంటి మధ్య ఒక సత్యం ఇమిడియున్నది. ఈ సత్యానుభవమునకు, నీకు మధ్య ఏడు పొరలు కలిగిన తెర ఉన్నది. ఈ తెర ఛేదింపబడితేనే తప్ప ఈ సమస్య పరిష్కరింపబడదు.

భ్రూమధ్యమునకు నేరుగా ఉన్న స్థానము భూమా. ఈ భూమా అనుభవము పరిమితము కాదు. అపరిమితమైనది. సర్వమయినది. తనకు, ఈ అనుభవమునకు మధ్య ఏడు పొరలు కలిగిన ఒక తెర ఉన్నది. ఈ తెరను తొలగించుకోవడానికి మార్గములు ఇవి. మన ముఖమునందు ఉండిన ఒకటి నోరు. 2–3 చెవులు. 4–5 కళ్లు. 6–7 ముక్కు రంధ్రములు. ఈ ఏడు మార్గముల ద్వారా ఏడు పొరలు కలిగిన తెరను ఛేదించాలి. తెరలు అనగా : కామ, క్రోధ, మద, మోహ, ఈర్ష్యమాత్సర్య, అహంకారములు. అభేద్యమయిన ఈ మాయ తెరను తొలగించుట ద్వారానే నీలో ఉన్న నీ నిజ స్థితి మేల్కొంటుంది. అప్పుడు సద్గురువు మరొక ఆశీర్వాదము యిస్తాడు. ఈ ఆశీర్వాదము ఏమనగా ప్రజ్ఞానం బ్రహ్మ అని, బ్రహ్మానుభవాన్ని పొందడానికి అవసరముగా ప్రజ్ఞ నీకనుగ్రహింప బడుతుంది. నీకనుగ్రహింపబడిన ప్రజ్ఞయే సుమా బ్రహ్మము అని ఆ బ్రహ్మమే నీవై ఉన్నావు అని ఆశీర్వాదము గురువు అనుగ్రహిస్తాడు. ఆ అనుగ్రహము ద్వారా ఏమి జరుగుతుంది?

నోరు మాట్లాడుతూ మౌనము వహిస్తుంది. ఏంత తమాషాయో చూడండి. మాట్లాడుతుంది. మౌనము వహించుతుంది ఏక కాలమందే. చూస్తూనే



ఉంటుంది. కళ్ళు లేనిదై పోతుంది. అనగా కళ్ళు చూస్తూనే ఉంటవి. ఈ చూడడం ద్వారా ఏ ముద్రలు (Impression) ఉండవు. అలాగే చెవులు వినగలిగే సమర్థత కలిగి ఉంటవి. కాని ఏమి వినవు. అలాగే వినగలిగిన చెవులు వినకుండగ, చూడగలిగిన కళ్ళుచూడకుండగ, మాట్లాడగలిగిన వాక్కు మాట్లాడక ఈ ఏడు పొరలు కలిగిన తెరను దాటించేస్తాడు గురువు. అపుడు ప్రజ్ఞానం బ్రహ్మ అనే ఆశీర్వాదం ఏం చేస్తుంది? ఆరవ చైతన్య భూమికలలో ప్రవేశింపచేస్తుంది. దేవుని ముఖాముఖిని నిలబెట్టేస్తుంది. దేవుని దివ్యదర్శనానుభవాన్నిస్తుంది.

**నిర్వాణనుభవము అనగా :**

అంతవరకు నీకు ఏవో చిల్లర కోరికలు ఉండవచ్చు. దేవుని తారసపడితే నేను ఈ కోరిక కోరుకుంటాను. ఆ కోరిక కోరుకుంటాను అనుకోవచ్చును. ఇంక దేవుని తన ఎదుట తారసపడ్డాడు అనగా ప్రత్యక్షమయ్యాడు. ఈ ప్రత్యక్షకాలములో ఇంక కోరే మనుసు ఏది? కోరడానికి సంస్కారములు ఎక్కడ ఉన్నవి. ఆ విధముగా దేవుని కైంకర్యమైపోతాడు. ఆ దేవునితో తాదాత్మ్యత చెందుతాడు. అనగా దేవునికి తన అన్యము కాకుండా ఉంటాడు. దేవునికి తనకు అన్యము కాని ఆ అనుభవములో తను జాగృతమయ్యేప్పటికి ఇప్పుడు ప్రపంచము లేదు, ఏమీ లేదు. నిర్వాణననుభవము మాత్రము ఉన్నది. అనగా అమనస్క స్థితియే ఉన్నది.

అప్పుడు దేవుడు లేడు. దేవుడు తారసపడితే మన సమస్యలు తీరుస్తాడు. మన కోరికలు తీరుస్తాడు. మనకేవో అనుభవములు యిస్తాడు అన్న ద్వైత ప్రవృత్తి లేదు. ఆ దైవీ అనుభవములో జీవితాన్ని జీవించాలి అనే వాంఛలున్నంత వరకే దేవుని ఉనికి ఉంటుంది. తీరా దేవునిలో తాను కైంకర్యమయినప్పుడు ఏ

కోరికలు ఉండవు. అప్పుడు జీవుడు లేడు. దేవుడు లేడు. ఇంక సాధకుడు లేడు. సాధన లేదు. అనుభవము లేదు. అనుభవజ్ఞులు లేరు – అనేటటువంటి నిర్వాణనుభవము పొందుతాడు. అనంతమయిన దివ్య అహము అనగా అహమస్మినే మహాచైతన్యము అని పేరు పెట్టారు. బుద్ధ భగవానుడు చెప్పిన నిర్వాణము పై యీ అనుభవమునకు సంబంధించనదే తప్ప దేవుడు లేడు అని చెప్పడానికి కాదు. బుద్ధ భగవానుడు చెప్పినటువంటిది ఈ నిర్వాణానుభవమునకు సంబంధించినది. నేను ఉన్నాను అనంతంగా నేను ఉన్నాను. అహమస్మి అనేటటువంటి నీకు అన్యముగా కాదు నీవు లేవు. ఉన్నది నేనే. ఆ నేను అనేది ద్వంద్వము లేనటువంటిది. అటువంటి దివ్యానుభవములో ఉన్నప్పుడు గురువు మరొక ఆశీర్వాదము ఇస్తాడు. అదేమంటే? అయమాత్మా బ్రహ్మ ఆ ఆత్మే సుమా బ్రహ్మము అని. ఇంత వరకు అన్వేషించిన ఆ బ్రహ్మము నీవేసుమా. ఆ ఆత్మే బ్రహ్మ అనే అనుభవములో ఎక్కడకు వెళ్ళుచున్నాడు? "అహము, బ్రహ్మస్మి" అనే అనుభవం పొందుచున్నాడు. అనగా "నేను బ్రహ్మమయ్యి' ఉంటిని. "నేను బ్రహ్మము నయ్యే ఉన్నాను. అన్న స్వానుభావ జ్ఞానమందు తనే బ్రహ్మమయ్యి" ఉంటాడు.

ఈ విధమయిన సాధన తత్త్వానికి – అనుష్ఠానానికి ఒక వంతెన లాంటిది సోహం ధ్యానము. సోహం ధ్యానము ఆత్మ ధ్యానము. ఆత్మ ఆత్మతో కూడిన నిరాకార ధ్యానము సోహం ధ్యానము. ఆత్మయే యైయున్న నీవు మాయా వలయము నుండి విడివడి తిరగి నీవైయున్న ఆత్మగా జీవించుటకు మార్గము స్వాత్మ యోగమగు సోహం మార్గమే మార్గము. రేచక పూరక కుంభకములుగా సంచరించుచుండు జీవాత్మయనెడి హంసను తెలిసి సదా పెదవులను బంధించి తదేక ధ్యానముగా నుండు సోహం భావ సాధనే ఆత్మసాధన. ఆత్మ స్వరూపుడగు



తానే పరబ్రహ్మమనియు. పరబ్రహ్మమే తాననియు అభేద ఐక్యమును గుర్తెరింగి సదా సోహం భావమును కూడా మరచి తదాకారముగా కలిసియుండు సాక్షాత్కారానుభవమే మోక్షము.

ఈ సత్యానుభవము గురుకృపతో తప్ప సాధకుడు పొందలేడు. కనుక గురుకృప కోసము గురువు చెంగును గట్టిగా విడవకుండా మరపులేని ఎరుకతో పట్టవలెను. ఆ పట్టు నిన్ను బ్రహ్మములో కలిపివేయును. ఇదే నీవు చేయవలసినది సుమా !

॥ ఓం తత్సత్ ॥

## చందాదారులకు మనవి

శ్రీసాయిదర్శన్‌ను ఏప్రియల్ 2008 నుండి ఎక్కువ పేజీలు, టైటిల్ ఆర్టుపేపరుపై ముద్రించి సాయిబంధువులకు అందిస్తున్నాము. అందువల్ల అదనంగా ఖర్చు భరించవలసి వస్తుంది. అందుకొరకు పత్రిక చందా పెంచకుండా మీకు అందుబాటులోనే 'శ్రీసాయిదర్శన్' మీ ఇంటికి పంపుట జరుచున్నది. ప్రతి చందాదారు శ్రీసాయిదర్శన్‌కు ముగ్గురు సభ్యులను చేర్పించి, ఉచిత కానుక పొందగోరుచున్నాము. బంధుమిత్రులను సభ్యులుగా చేర్చుటగాని, లేదా బంధువుల పేర మీరు చందా చెల్లించిన వారికి మీ కానుకగా పంపుచున్నట్లు ఉత్తరం ద్వారా వారికి తెలియపరచగలం.

శ్రీసాయి ప్రబోధ ప్రచారమునకు మీ సహాయ సహకారములు అందించి శ్రీసాయినాథుని కృపాకటాక్షములకు పాత్రులు కండి.

– **రావూజీ,** ఎడిటర్

# ఆధ్యాత్మికచింతనతోనే ఆనందం

సంకలన కర్త : యం. వెంకటరావు, న్యూపాల్వంచ



ప్రస్తుతకాలంలో మానవులు కూడా యంత్రాల్లా మారిపోతున్నారు. ప్రతినిముషం పరుగులమయమై పోతున్నాది. జీవిత నిర్వహణకు ధన సంపాదన ఎంత ముఖ్యమో, జీవిత లక్ష్యానికి భక్తి, శ్రద్ధలు కూడా అంతే ముఖ్యము. జీవనోపాధి కోసం రాత్రింబవళ్లు నిర్విరామంగా శ్రమించనిదే జీవిత నిర్వహణ దుర్భరమై పోతున్న నేటి సమయంలో జీవిత లక్ష్యానికి దూరమై పోతున్నారు.

భౌతికవాదమే గమ్యమనుకొన్నప్పుడు జీవితం భారంగా, బాధా మయంగా కనిపిస్తుంది. అలాగాక ఆధ్యాత్మికతనే జీవిత పరమార్థంగా ఎంచుకుంటే జీవితం అర్ధవంతంగా, ఆనందమయంగా మారుతుంది.

జీవుని వ్యక్తిత్వమునకు, ఈశ్వర చైతన్యముతో సన్నిహిత సంబంధము గలదు. పరమేశ్వరచైతన్యమే ఉపాధిబద్ధమై జీవరూపమున ప్రకాశించుచున్నది. కావున ప్రతిజీవియందును దివ్యత్వము గర్భితముగా నున్నది. అంతర్గతమైయున్న ఆ దివ్యత్వాన్ని వ్యక్తం చేయకయే జీవన పరమావధి సరియగు మనోభావముతో నవలంభించినచో, సమస్త సుఖములును ఈ ఆత్మ వికాసమునొనగూర్చుటకు తోడ్పడును.

పారామార్థిక జీవనమునకు ప్రధానాంగము బలము. శారీరక





మానసికాధ్యాత్మక బలము. బలమే పుణ్యము. దౌర్బల్యమే పాపము. బలమున కంతకును మూల కారణము, తన యందును భగవంతునియందును నమ్మిక. ఆత్మ నిరసనము లేక స్వయముగా తాను పాపిననుకొనుట ధర్మ లక్షణము కానేరదు. అట్టి దౌర్బల్యమును త్రోసిపుచ్చి స్వతసిద్ధమగు తన దివ్యత్వమును ధ్యానించుటచే మానవుడు పాపవిముక్తుడు కాగలడు గాని 'నేను పాపి' నని సర్వదా ననుకుండుటచేత విముక్తుడు కాజాలడు. నిజముగా అమృతపుత్రుడగు మానవుని పాపియనుట కంటే మహాపాపము మఱియొకటి లేదు. "నా అంశయే అనాదికాలమునుండి ఈ లోకమందు జీవుడైనాడు" అని గీతా వాక్యము. మానవుడు భగవదంశ సంభూతుడే. అతడు దేహదృష్ట్యా అల్పుడుగా నున్నన, వాస్తమునకు "ఈశ్వర స్వరూపుడే" అని మనకు స్పష్టమగుచున్నది. అటువంటి ఉత్కృష్టమయిన మానవజన్మను జీవితాంతం నారాయణసేవతో చరితార్థం చేసుకోవాలి.

ప్రాపంచిక వస్తువులను, సుఖభోగవస్తువులను, ధనసంపాదన కొఱకు, రాత్రింబవళ్ళు నిరంతర పోరాటన సాగించుచున్నను, శాశ్వత సుఖమును పొందలేక దుఃఖఫలితముల ననుభవించుచున్నారు. క్షణిక వస్తువులనుండి శాశ్వత సుఖమెట్లు లభించును? అట్టి క్షణిక వస్తువులను సంగ్రహించి జీవతము సుఖవంతమొనర్చుకొందమన్నను, ఈ దేహము అశాశ్వతము గదా ? అనీశ్వర దేహమునకై క్షణిక సుఖము పొందుట అవివేకమని గుర్తించి కొందఱు వివేకులు శాశ్వతసుఖానంద ప్రాప్తియే తమ జీవిత లక్ష్యముగా భావింతురు.

భగవంతుడు మనకిచ్చిన శక్తిని, సద్వినియోగముచేసిననే గాని మన

కాతడు అధికముగా నీయడు. కాబట్టి భగవదనుగ్రహము పొందుటకైనను మానవప్రయత్నము ఆవశ్యకమైయున్నది. ఇట్లు చేసినచో పది జన్మలలో పొందవలసిన అనుభవములు దైవానుగ్రహము వలన ఒక జన్మలోనే తీఱిపోవుచుండును. ఏమైనను కొంత మానవ ప్రయత్నము అత్యావశ్యకము.

ఆసక్తితో సాధన చేసేవారికి, దివ్యచరిత్రలను శ్రద్ధగా వినేవారికి, భగవంతుని అనుగ్రహము లభిస్తుంది. ప్రేమతో, విశ్వాసంతో, దైవనామం ఉచ్ఛరిస్తే, దైవానుగ్రహం సంపాదించుకోగల శక్తి అబ్బుతుంది.


అ సర్వేశ్వరుడు కోసం సాధన చేయాలి. సాధన చేయడం కోసం మనస్సును శుద్ధం చేసుకోవాలి. మనఃశుద్ధి కోసం సత్కర్మలనే ఆచరించాలి. మంచి పనులు చేయడానికి తిథి వార నక్షత్రాలతో పనిలేదు. ఈ క్షణంనుంచైనా సరే మంచి పనులు చేయడం ప్రారంభించాలి. వ్యర్థప్రసంగాలకు, అనవసర కార్యకలాపములకే ఆయుర్దాయం సరిపోతే సత్కర్మలను ఆచరించడం ఎప్పుడు? వ్యర్థప్రసంగాల వల్ల ప్రయోజనం ఉండదు. ఇకనైనా నిర్మల ప్రశాంతచిత్తంతో, భగవదన్వేషణ చేద్దాం. ఆధ్యాత్మిక చింతనతోనే పరమానందం పొందుదాం.

పెద్దల బోధలవలన, దాన ధర్మములవలన, క్షమాగుణాలవలన, పుణ్యగ్రంథపఠనవలన, శ్రవణము వలన, నిత్యదేవాలయ సందర్శనములవలన దైవభక్తి కలుగుతుంది. కర్మలను ఆచరించినప్పుడే భక్తి విశ్వాసములు అలవడుతాయి. భక్తి కలిగినప్పుడే జ్ఞానము సంప్రాప్తము కాగలదు. జ్ఞానమువలననే జీవుడు మోక్షము సాధించగలడు. మోక్షముపొందాలంటే ఆత్మజ్ఞానం కావాలి. ఆత్మజ్ఞానం కావాలంటే ఆధ్యాత్మిక సాధన చేయాలి. కనుక కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యములు – మానవ జీవితమునకు అవసరము. దైవపూజలు, వ్రతాలు, ఉపవాసములు మొదలైనవి దైవక్రియలు. నిత్యము దైవ కర్మచేసేవారికి పాపకర్మ పీడించదు. నిత్య దైవరాధన వలన మనః



శ్శాంతితో పాటు దైవముపై భక్తి కలుగుతుంది. భక్తివలన ధర్మబద్ధమైన జీవనవిధానము కలుగుతుంది. అనేక జన్మలనుండి వెన్నంటి వచ్చుచున్న పాపములు నశించి జీవితంలో స్థిరత్వం కలుగుతుంది. సకల కార్యములందు ఆటంకములు తొలగుతాయి. ఐశ్వర్యము పెరగుతుంది. మంచి చెడు విచక్షణా జ్ఞానము, నిగ్రహము కలుగుతాయి. జీవితం అర్థవంతంగా ఆనందమయంగా మారుతుంది.

భక్తి అంటే పూజగదిలో పది నిముషాలు గడపడం కాదు. దేవాలయానికి వెళ్ళి కొబ్బరికాయలు కొట్టడం కాదు. 'భక్తి' అంటే సంపూర్ణంగా భగవంతుని శరణం కోరడం. 'కామం, క్రోధం, కసి, భయం, ఉక్రోషం'వంటి భావాలకు అతీతంగా తయారవగలిగినవాడే అసలైన భక్తుడు. "భక్తి భావం నుంచి మనసు ఏమాత్రం ప్రక్కకు తొలగినా, చలించిపోయి బాధపడి తిరిగి మనసును భగవంతుని మీదకు మరింత తీవ్రంగా మళ్ళించినవాడే నిజమైన భక్తుడు" అన్నారు నారదమహర్షులవారు. మనిషిలో దాగున్న జ్ఞానకర్మ శక్తులన్నింటినీ ఒకే చోట కేంద్రీకరించి ఆ శక్తుల్ని భగవంతుని మీదకు మళ్ళించాలి. అప్పుడు భగవంతుడు తప్ప, మరేదీ కనిపించదు. భగవన్నామ స్మరణ తప్ప మరేదీ వినిపించదు. భగవన్నామాలు తప్ప మరేదీ నోట వెంట వెలువడదు. అటువంటి స్థితిని పొందినవాడే నిజమైన భాగవతోత్తముడు. భక్తుడిలో పుట్టిన ఆ శక్తి, భక్తుని హృదయంలోని మలినాన్ని కడిగివేస్తుందనీ, మెదడులోని చెడు ఆలోచనలను పారద్రోలుతుందనీ, శ్రీమద్భాగవతంలో పేర్కొనబడింది.



# ప్రారబ్ధకర్మ

మనిషి దేవుడవటానికి సాధనలు అనుష్టించాలి. సాధనానుష్ఠానాలతో సకలం సిద్ధిస్తుంది. అవి 1. జపధ్యానాదులు 2. సేవ – సాధన.

జపధ్యానాదులు ఉదయం, సాయంత్రం, సంధ్యాసమయాలలో నిర్దిష్ట సమయాల్లో ఇష్టదైవం ముందు కూర్చుని శక్తిమేరకు ఆరాధించాలి, జపం చేయాలి. అంటే గురువు ప్రసాదించిన మంత్రాన్ని భక్తి ప్రపత్తులతో పదే పదే ఉచ్చరించాలి. పావన భగవన్నామం మనోమాలిన్యాలను తొలగించివేస్తుంది. జపం ఒక సాధన. మనం ప్రయత్నించి అభ్యసించాలి. నిజానికి ధ్యానం సహజంగా చేకూరవలసిన స్థితి. ధ్యానం కుదరకపోతే జపం చేయి. జపం చేస్తే తప్పక మనస్సు ఏకాగ్రమవుతుంది.

భగవంతుణ్ణి పొందటం లక్ష్యం. ఆయన మనతోనే ఉంటున్నాడనే విశ్వాసం – ఈ రెండూ సదా మనకు ఉండకుంటే సాధనలో విజయం సిద్ధించదు. సాధనలో విశ్వాసమూ, స్పష్టతా ఉండాలి.

సాధన సమయంలో మనం ఆరాధించే లేదా ధ్యానించే ఇష్టదైవం కేవలం విగ్రహమనో, చిత్రపటమనో భావించరాదు. వాటిలో వాస్తవంగానే మన ఇష్టదైవం వెలసి వుండడం మనకు స్ఫురించాలి. సజీవ దైవానికే ప్రార్థన, ఆరాధన, జపధ్యానాదులన్నీ చేస్తున్నామనే భావనతో విశ్వసించాలి.

భగవంతుడు మనకు పరమ ఆప్తుడు. మన సొంతం. ఇదే మనిషికీ



భగవంతునికీ మధ్యనున్న నిరంతర బాంధవ్యం. ఈ బాంధవ్యం ఎంత ప్రగాఢమవుతుందో భగవంతుడు అంత సన్నిహితుడు అవుతాడు.

## ప్రారబ్ధ కర్మ :

ప్రారబ్ధ కర్మను ఎవరూ తప్పించలేరు. ప్రారబ్ధకర్మ అందరు అనుభవించవలసిందే. ప్రారబ్ధ కర్మ తొలగిపోయిన తదనంతరమే మనం అనుష్టించే జపధ్యానప్రార్థనాదులు ఆధ్యాత్మిక అనుభూతులను ఇవ్వనారంభిస్తాయి. నిజానికి సాధనలు అనుష్ఠించే వారి జీవితంలో ప్రారబ్ధ ఉద్ధృతం తగ్గిపోతుంది.

## ప్రార్థన ఫలితం :


ప్రార్థన ఫలించేదాకా ఓర్పుతో వేచివుండాలి. అంతవరకు ఎదురయ్యే పరీక్షలను ప్రశాంతంగా భరించాలి. దీనిలో విజయవంతుడైన వ్యక్తి మాత్రమే భగవదనుభూతి పొందుతాడు. ఆధ్యాత్మిక జీవితం పట్ల మనకు ఎప్పుడైతే అభిరుచి జనిస్తుందో అప్పుడే భగవంతుని కృపాశక్తి మనలో పనిచేయటం ప్రారంభిస్తుంది. మనోస్థైర్యాన్ని కోల్పోకుండా ప్రార్థనను ఆలంబన చేసుకోవాలి. సముచిత తరుణంలో అంతా సిద్ధిస్తుంది.

ప్రారబ్ధ కర్మానుసారమే ప్రాణుల ప్రవర్తిస్తాయి. దుఃఖాలు అనుభవిస్తున్నాయి కానీ భగవంతుడు సంకల్పిస్తే ప్రారబ్ధకర్మ అనుభవించవలసిన కాలవ్యవధిని తగ్గించి, సత్వరమే అనుభూతిని అనగ్రహించగలడు.

(సద్గురు వాణి నుండి)

# నేటి మానవ జీవితం

**-ఆర్. కైలాసరావు,** *శ్రీ షిర్డీసాయి సేవామందిరం, ఉప్పాడ-533 448, తూ.గో. జిల్లా*




**అ**నంతమైన సృష్టిలో అత్యుత్తమమైనది మానవజన్మ. మాట్లాడేశక్తి, ఆలోచన, వివేకము కలిగిన జాతి. కాని మిగిలిన జీవరాశుల కంటె ఎక్కువగా అశాంతి, దుఃఖం, భయం, ఆందోళనలతో సతమతమవుతున్నది కూడా మానవజాతే. దీనికి కారణం అజ్ఞానం, మాయ మానవులను నడిపించడమే, స్వయంకృతాపరాధమే, అనిత్యాన్ని నిత్యంగా భావించడమే.

ప్రేమ, దయ, సత్యం, నీతి, నిజాయితి, న్యాయం, దానము, వినయము, బాధ్యత మొదలైన సద్గుణాలు కలవారు అధికంగా వున్నంతకాలం మానవసమాజం సుఖశాంతులతో వర్ధిల్లింది. అప్పుడు కూడా రాక్షసప్రవృత్తి, దుర్మార్గవర్తన కలవారు వున్నా అతితక్కువమంది మాత్రమే. నేడు బాహ్యాకారాల్లో లాగా గాక అంతరంగంలో రాక్షసులైనవారు లెక్కకుమీరి వున్నా మనకు తెలియదు. ఆశ, మోహం, కాంక్ష, మదము, అసూయ, నిర్లక్ష్యం, నిర్దయ, ప్రేమరాహిత్యం మొదలైన మానసికరుగ్మతలతో నేటి మానవజాతి పీడింప బడుతోంది.


మహాత్ములు, అవతారపురుషులు, ప్రవక్తలు మానవప్రవర్తన నిర్దేశిస్తూ అనేక బోధనలు చేశారు. మతాలన్నీ కూడా మానవజీవితవిధానాన్ని నిర్దేశిస్తూ మంచిని బోధించాయి. నేడు మహాత్ముల బోధనలు మరుగునపడ్డాయి. మత






ధర్మాలు ఏమిటో తెలియకుండానే మానవులు మతాల ననుసరిస్తున్నారు. మానవునను నైతిక విలువలు కలవారుగా మార్చడానికి ప్రయత్నించే మతప్రచారకులు, బోధకులు, మానవతావాదులు అరుదైనారు.

మానవులను పట్టి పీడిస్తున్న పెద్ద రుగ్మత ధనకాంక్ష. ప్రతీవాడూ ధనం సంపాదించాలనుకునేవాడే. అవసరమైన దానికి లక్షలరెట్లు సంపాదించవలసిన అవసరమేమిటి? అంతులేని సంపదను ప్రోగుచేసిన వారి తర్వాత తరంలో తిండి గూడా లేని వారుండటం చూడటం లేదా? ధనవంతుడు బికారిగా, బికారి ధనవంతుడుగా మారటం చూస్తున్నాం కదా ! విపరీతమైన ధనాశ, అది సంపాదించడానికి వక్రమార్గాలు, హింసలు, మోసాలు మొదలైన వాటివల్ల అంతులేని కర్మఫలాన్ని ప్రోగేసుకుని నీచ జన్మలు సిద్ధం చేసుకుంటున్నామని గ్రహించని అజ్ఞానంతో మనం ఉన్నాం.



రెండవ జబ్బు మోహం. నేను, నాది అనుకోవడం ఒక పెద్ద జబ్బు. నేను, నావాళ్ళు అని ప్రాకులాడతాం. కానీ ఆలోచిస్తే అర్థం అవుతుంది ఎవరు నీ వాళ్ళు కారని. అమ్మా, అమ్మా అంటూ చిన్నతనమంతా కొంగుపట్టుకొని తిరగిన నీ తల్లి నీ జీవితంలో ఉంటుందా? చిన్ననాటి నీ ప్రాణస్నేహితులందరూ ఈనాడు నీతో వున్నారా? బంధాలు, బంధుత్వాలు శాశ్వతమా? అలాంటప్పుడు నీవారి పట్ల నీ కర్తవ్యాన్ని నిర్వహిస్తే చాలదా? వారి కోసం కాని పనులెన్నో చేసి కర్మఫలాలు మూటగట్టుకోవాలా?



ధనము, కీర్తి, పదవి, సామర్థ్యము, యవ్వనము మొదలైనవి శాశ్వత మనుకొంటాము, కాని కావు. ఇది మానవులలో గర్వం పెంచుతుంది. దానినే మదం అంటారు పెద్దలు. మంచి స్థితిలో వున్న నీ చిన్ననాటి ప్రాణస్నేహితుడు, సామాన్యునిగా నీ వైపు చూడటానికి కూడా ఇష్టపడడు. గొప్పవారి మనుకునేవారు ఇతరులను చిన్నచూపు చూడటం మనకు తెలుసు. కానీ వారికే తెలియదు వారి గొప్పతనం నీటి బుడగలాంటిది.

తల్లిదండ్రులను, గురువులను పూజించే సాంప్రదాయం మనది. పెద్దలను గౌరవించడం మన సంస్కృతి. ఈనాడు ఎంతోమంది తమ ముసలి తల్లిదండ్రులను వారి కర్మకు వదిలివేస్తున్నారు. విలాసవంతమయిన జీవితం గడుపుతున్నారు. వారి తల్లితండ్రులు కేవలం 'టీ'కోసం రెండు రూపాయలు యాచించడం చూసిన నా మనస్సు చలించిన సందర్భాలు చాలా వున్నాయి. నీ జన్మకు, ఈనాటి నీ స్థితికి కారకులు వారేననే విషయం మరచిపోయిన వారిని ఏమనాలి? గురువు అనే పదానికి ఈ కాలంలో అర్థమే మారిపోయింది. అసలు గురువంటే ఎవరు? ఆయనను మనం ఎందుకు చేరాలి? అన్నది తెలియనివారే చాలా ఎక్కువ. పెద్దలను గౌరవించడం మరచినవారే సమాజంలో ఎక్కువమంది కనిపిస్తున్నారు. ఇక సోదరసోదరీల మధ్య అనురాగాలు, బంధువుల మధ్య అప్యాయతలు చాలావరకు తగ్గిపోయాయి. స్నేహాలు కూడా అవసరాన్ని బట్టి ఏర్పడుతున్నాయి కాని హృదయపూర్వకంగా కాదు. కపటం, నటన తప్పి స్వచ్ఛమైన గౌరవమర్యాదలు స్నేహాలు కరువైపోయాయి.

మానవులను పట్టి పీడిస్తున్న మరో జబ్బు దుర్వ్యసనాలు. త్రాగుడు, మాదకద్రవ్యాలు, జూదము, అక్రమసంబంధాలు నేడు సాధారణమై పోయాయి.



ఒకప్పుడు వీటని సమాజంలో అసహ్యించుకునేది. మరి ఇప్పుడో? వీటి దుష్ఫలితాలు తెలియజేసే ఆలోచనాపరులే కనబడరు. వీటివల్ల ఎంత హింస, ఎన్ని నేరాలు జరుగుతున్నాయో మనకు తెలియనది కాదు.

మానవుడు ఆధునిక విజ్ఞానంతో సమకూర్చుకొన్న అన్ని సౌకర్యాలు వినాశహేతువులే అని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. వాహనాలు సుఖప్రయాణం ఇస్తాయి, ప్రమాదాలు, మరణాలు కల్గిస్తాయి. పరిశ్రమలు సౌకర్యకర వస్తువులనూ ఇస్తాయి. కాలుష్యం వెలువరించి ప్రకృతి విలయాలను తెస్తాయి. సినిమా, టీవీ మొదలైనవి ఆనందాన్ని ఇస్తాయి. చెడు ఆలోచనలనూ ప్రేరేపిస్తాయి. ఆయుధాలు ఆత్మరక్షణకూ, దేశరక్షణకూ, ధర్మ పరిరక్షణకూ పనికివస్తాయి. ఉగ్రవాదుల, దుర్మార్గుల చేతులలో పడి మానవవిధ్వంసాన్నీ సృష్టిస్తాయి.

ఇలా సమన్వయం చేసుకుంటూపోతే మానవజాతి వినాశనానికి, అశాంతికి భద్రతరాహిత్యానికి, సకలదుఃఖాలకు కారణం మానవులే అని అర్థం అవుతుంది. వీటని నివారించే శక్తి కేవలం ఆధ్యాత్మికంనకే వుంది. మతాలను కేవలం కాలక్షేపంగా, యాంత్రికంగా అనుసరించక వాటిలోని విజ్ఞానాన్ని గ్రహించండి. మతాతీత కులాతీతమైన సర్వమానవశ్రేయస్కరమై, అనుసరించడానికి, సులభమైన శ్రీషిర్డీ సాయి మార్గాన్ని అనుసరించడం ద్వారా మానవత్వం గల మానవులు తయారవుతారు. ప్రశాంతమైన, ఆనందకరమైన మానవసమాజం ఏర్పడుతుంది. రండి, శ్రీ సాయిమార్గంలో నడవండి. భూలోకాన్ని ఆనందనిలయంగా మార్చుకొందాం.

జై శ్రీ శ్రీసాయినాథ

# మానసిక ఏకాగ్రత

**– అనిత,** హైద్రాబాద్

**మా**నసిక ఏకాగ్రత లేకుండా మనమేమీ సాధించలేము. అంతేకాదు ఏ విషయం గురించీ జ్ఞానం పొందలేము. ఏ పనినైనా సరిగ్గా చేయాలన్నా, పరిజ్ఞానం సేకరించాలన్నా, మనస్సు పూర్తిగా లగ్న మవ్వాలి. ఒక విషయం యెడల సరియైన పరిజ్ఞానం పొంది, నేర్పుతో, చతురతతో ఆ పని చేయటం మాత్రం తీవ్రమానసిక ఏకాగ్రత ఫలితంగానే సాధ్యమవుతుంది.



మనం చేసే ప్రతి పనిపై మనం మనస్సు నుంచాలి. లేనిచో ఏ పనిని సాధించలేము. ప్రతిపనిపై ఎంత ఎక్కువ మనస్సును లగ్నంచేస్తే, అంత బాగా పనిజరుగుతుంది.

మనస్సును ఒక పనికిగానీ, విషయానికిగానీ శ్రద్ధాపూర్వకంగా బద్ధం చేయటం. ఈ బద్ధత, శ్రద్ధ, లేక మనస్సును లగ్నంచేయటం సంపూర్ణమయితే లేక పరిపూర్ణతను చేసుకుంటే, దానినే 'మానసిక ఏకాగ్రత' అంటారు. మనంచేస్తున్నా పనియందుగానీ, చదువుతున్న విషయమందుగానీ, సరియైన విధంగా మనస్సును లగ్నం చేయటమే మానసిక ఏకాగ్రత. ఎంత ఎక్కువగా మనస్సును ఏకాగ్రం చేయగలిగితే, అంత ఎక్కువగా ఏ పనిలోకనైనా విజయసాధనకు అవకాశాలున్నాయి.

ఉదాహరణకి 'చదువు' విషయమే తీసుకొండి. మనస్సును సరిగ్గా లగ్నం చేయకపోతే చదవలేము. కానీ తీవ్రంగా మనస్సును చదువుపై నిలిపితే,



సులభంగా చదువును అర్ధంచేసుకొని, నిష్ణాతులవ్వ గలము. చదివినట్లు జ్ఞాపకం ఉంచుకోగలం. అంతేకాదు. మానసిక ఏకాగ్రతతో చదివితే, ఎక్కువ విషయాలని తక్కువ సమయంలో పూర్తిచేయగలం. సరిగ్గా అర్ధం చేసుకోగలగటమే కాక చదివిన ప్రతి దానినీ గుర్తుంచుకోగలం. మానసిక ఏకాగ్రత వలన అటువంటి లాభాలున్నాయి. అది లోపిస్తే అన్నీ లోపిస్తాయి. ఒక ప్రక్క ఏ పనీ సరిగ్గా చేయలేము. మరొకప్రక్క కాలాన్ని వృధాగా వ్యర్థపరచటమవుతుంది. సరిగ్గా ఏకాగ్రం చేయబడిన మనస్సు సహాయంతో ఏ పనినైనా పరిపూర్ణతతో వేగంగా అతి తక్కువ సమయంలో సాధించవచ్చు.

మానసకి ఏకాగ్రతను సాధించటమనేది విజ్ఞత అవుతుంది. అజ్ఞానముతో దాన్ని విస్మరిస్తే, మన జీవిత సమయంలో పోగొట్టుకొనేది చాలా ఎక్కువగా వుంటుంది. దాన్ని నేర్చుకుంటే క్రమక్రమంగా మనస్సు శ్రేయస్సును చూకూర్చి, చివరకు విజయసాధనకు దారి తీస్తుంది.

## ముఖ్య గమనిక

**శ్రీసాయిదర్శన్ మాసపత్రిక ప్రతీనెల శ్రీసాయిదర్శన్ వెబ్‌సైటులో చదువుకొనవచ్చు. ముఖ్యమైన అధ్యాత్మిక విషయాలు తెలుగు, ఇంగ్లీషులో త్వరలో ప్రవేశపెట్టుచున్నాము. నేడే వెబ్‌సైట్ చూడగలరు!**

**e-mail : srisaidarshan@rediffmail.com**
**Website : www.srisaidarshan.org.in**



# 2009 కేలండర్

శ్రీ షిర్డి సాయిబాబా (గోల్డు సింహాసనం) మల్టీకలర్ కేలండర్ (సైజు 40" × 56 ") పైన, క్రింద రూలర్స్‌తో పోస్టేజీ లేదా కొరియర్ ఛార్జీతో కలిపి రూ. 175/-లు. సెప్టెంబరు ఆఖరివారంనుండి లభ్యమవుతుంది. ఆర్డరు చేయువారు ఈ దిగువ అడ్రసుకు మనియార్డరు చేయకోరుచున్నాము.

**SRI SAI DARSHAN**
**Dammaiguda, Hyderabad - 500 083.**



## లేఖలు

### 90 రోజులు, 90 యిండ్లలో సాయినామ సంకీర్తన

చిత్తూరు జిల్లా మదనపల్లిలో శ్రీసాయినాథుని సంకల్పముతో శ్రీరావూజీగారి ఆశీస్సులతో "శ్రీ ద్వారకామాయి భజన సంఘం" ఆధ్వర్యంలో 24-07-2008 నుండి సాయినామ సంకీర్తన ప్రవాహంగా సాగుతుంది.

శ్రీసాయినాథుడు 15-10-1918 విజయదశమినాడు సమాధి చెందినారు. అనగా 90 సం॥ పూర్తికానున్న సందర్భముగా మదనపల్లిలో ప్రతిరోజు ఒక్కొక్క ఇంటిలో ఉ॥ 11.00 గం॥ల నుండి 12.30 గం॥ (90 ని॥లు) వరకు 'ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి' అను ద్వాదశాక్షరీ మహామంత్రాన్ని సంకీర్తన చేయుచున్నారు.

కులమత భేదములు, వర్గ భేదములు, చిన్నా పెద్దా తేడాలు లేకుండా ముందుగా కోరిన వారి ఇండ్లలో తేదీల ప్రకారము నిరాడంబరముగ, నిస్వార్థముగ, భక్తి శ్రద్ధలతో క్రమశిక్షణతో సాగుతున్నది. ప్రతి ఇంట సాయినామోత్సవాన్ని జరుపుకొని వారి అభీష్టములు తీర్చుకోవాలని భక్తులు కోరుకుంటున్నారు.

సమిష్టిగా సాయినాథుని స్మరించుకొంటూ సాయినాథుడే వరుణదేవుడై కృపావర్షమును కురిపించుతారని, సాయినామంతో ఆహ్వానిస్తున్నారు. యావన్మంది భక్తులు కార్యక్రమములో పాల్గొనవలసినదిగా ఆహ్వానిస్తున్నారు.

ఇట్లు సదా సాయిసేవలో

**శ్రీద్వారకామాయి భజన సంఘం,**

మదనపల్లి, వివరములకు : సెల్ : 9985725586, 231817

24-07-2008 గురువారం, వార్త దినపత్రికలో "ఆధ్యాత్మికం"లో సద్గురు సాయినాథుని లీలావిశేషాలు చదివి అందు "శ్రీసాయిలీలావిలాసము" గల పుస్తకము ఉచితంగా శ్రీసాయిదర్శన్ రావూజీగారి ద్వారా పొందవచ్చును అనే సమాచారం

దొరికినది. మహిమాన్వితులైన ఆ తండ్రి లీలావిలాసం దయచేసి మాకు పంపగలరని సవినయముగా కోరుతున్నాను. అనుకోని వార్త అందినందుకు మీనుండి ఆ సహాయం మాకు అందగలదని సద్గురు సాయినాథుని వేడుకొంటున్నాము.

- **వై.కృష్ణ,** తెలుగు లెక్చరర్, లక్ష్మణచాంద, ఆదిలాబాద్ జిల్లా

□□□

వార్తదినపత్రిక యందు శ్రీసాయిబాబా క్విజ్‌లో 24-07-2008 గురువారం రోజున ప్రశ్న : శ్రీ సాయిలీలా విలాసము ఉచితముగా ఎచ్చట లభిస్తుంది?

జవాబు : రావూజీ సాయిదర్శన్, దమ్మాయి గూడ, హైద్రాబాద్ - 500 083 ద్వారా సాయి లీలావిలాసము ఉచితముగా పంపబడును అని శ్రీయం.పి.సాయినాథ్‌గారు ప్రచురించినారు. శ్రీ శిరిడీ సాయి లీలామృతం సేవించడానికి 'శ్రీసాయిలీలా విలాసము'ను కోరుచున్నాము. పంపించగలరు.

- **తాండ్రసాయన్న,** లోకేశ్వరం, ఆదిలాబాద్

□□□

స్వామీ ! మీ హీలింగుతో చాలా మటుకు మానసికంగా తేరుకున్నాను. శ్రీసాయిదర్శన్ పుస్తకాలు కూడా కొంత ఊరట కల్గిస్తున్నాయి. నేను క్రిందటిసారి మీవద్దకు వచ్చినప్పుడు, నాకంటి సమస్య కొరకు మీరు కంటికి సంబంధించిన మేగ్‌నెటిక్ కళ్లజోడు ఇస్తానన్నారు. శ్రీసాయిదర్శన్ జూలై సంచికలో మీరు ఒక భక్తురాలికి (జి.యస్.నాగమణి, రిటైర్డ్ తెలుగుపండిట్) ఐ మిషన్ ఇచ్చి, వారి కంటికి స్వస్థత చేకూర్చారు. నేను నా కుడి కన్ను రెటీనా సర్జరీ, కాంట్రాక్టుసర్జరీ రెండు కూడా చేయించుకున్నాను. అయినా కంటి దృష్టి మెరుగుపడలేదు. మిషన్ ప్రాబ్లం అయి వుంటుంది. మీరు నా యందు దయవుంచి కంటిదృష్టిని మార్గాన్ని తెలుపగలరు.

- **సౌధామినీ,** బరంపూర్, ఒరిస్సా

Printed Published and owned by A.V.Ramana Rao at 1-5-62/2/B Maruthi Nagar, Hyderabad - 500 060. Printed at Sri Kala Printers, 1-1-781/B/4, Gandhi Nagar, Hyderabad - 80 Ph : 27611864, on behalf of Roopa Art Centre, Keshav Memorial Lane, Narayanaguda, Hyderabad - 029. Editor - **A.V.Ramana Rao**